TELTEL/2023/88710

# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU






ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

www.telanganamuchatlu.in

వరంగల్ సంపుటి : 2 సంచిక : 41 గురువారం 24 - 10 - 2024 పేజీలు : 08 వెల : 5 www.telanganamuchatlu.in

## హెచ్‌సీఏ వివాదాలపై
# సుప్రీంకోర్టులో విచారణ






న్యూఢిల్లీ, (అక్టోబర్ 23) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ వివాదాలపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరిగింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ప్రత్యేక బెంచ్ వాదనలు విన్నది. ఈ కేసు తదుపరి విచారణను రేపు (గురువారం)మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేస్తూ బెంచ్ నిర్ణయించింది. కాగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఎలక్ట్రోరల్ జాబితా తయారీ, ఎన్నికల నిర్వహణ కోసం గతంలో జస్టిస్ ఎల్ నాగేశ్వరరావును సుప్రీంకోర్టు నియమించింది. హెచ్‌సీఏకి ఎన్నికలు నిర్వహిం చడమే కాకుండానిర్వహణపైసిఫార్సులు చేయా లని జస్టిస్ ఎల్ నాగేశ్వరరావుకు సూచిం చింది. అయితే హెచ్‌సీఏ సభ్యుల్లో ఎక్కువ మంది కుటుంబ సభ్యులేనని ఆయన చేసిన సిఫార్సుపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు సుప్రీంకోర్టును కూడా

2లో

## టెర్రర్ ఫండింగ్‌పై
# ద్వంద్వ ప్రమాణాలు
## చైనాకు మోదీ చురకలు

కజాన్ (అక్టోబర్ 23) : ఉగ్రవాదంపై పోరుకు యావత్ ప్రపంచం ఏకతాటిపై నిలవాలని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. దీనిపై ద్వంద్వ ప్రమాణాలకు తావీయరాదని పరోక్షంగా చైనా తీరును ఎండగట్టారు. కజాన్‌లో జరుగుతున్న 16వ బ్రిక్స్ సదస్సు ముగింపు సమావేశంలో మోదీ మాట్లాడుతూ, ఉగ్రవాదం అనే తీవ్ర సమస్యను కలిసికట్టుగానే ఎదుర్కోవలసి ఉంటుందన్నారు. ఇలాంటి అంశాల్లో ద్వంద్వ ప్రమాణాలు సరికాదన్నారు. "ఉగ్రవాదం, ఉగ్రవాదులకు నిధుల సరఫరా అనేవి చాలా తీవ్రమైన సమస్యలు.



వీటిని చాలా సమర్థవంతంగా ఎదుర్కోవాలి. ఇందుకు అంతా కలిసికట్టుగా పనిచేయాలి" అని మోదీ సూచించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర నేరుగా ఏ దేశం పేరును ప్రస్తావించకపోయినప్పటికీ ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తున్న పాకిస్థాన్‌కు చైనా ఆర్థిక సహాయాన్ని ఎండగట్టారు. ప్రపంచ శాంతికి విఘాతం కలిగించే రాడికలైజేషన్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. యువతను అతివాదులుగా మారేందుకు ప్రేరేపించడాన్ని (రాడికలైజేషన్) సమష్టిగా ప్రపంచదేశాలు

2లో



## శ్రీవారిని దర్శించుకున్న సీతక్క
### పండితుల వేదాశీర్వచనం

తిరుమల, (అక్టోబర్ 23) : తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని మంత్రి సీతక్క దర్శించుకున్నారు. బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆమెతో పాటు వరంగ్ మేయర్ గుండు సుధారాణి కూడా ఉన్నారు.

2లో

# ప్రజాభిప్రాయ సేకరణ ఓ ప్రహసనం

- బిఆర్ఎస్ నేత ముందస్తు అరెస్ట్ దారుణం
- మండిపడ్డ మాజీమంత్రి జగదీశ్ రెడ్డి



యాదాద్రి భువనగిరి, (అక్టోబర్ 23) : రామన్నపేటల నిర్మించ తల పెట్టిన అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీపై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్తున్న మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, రవీందర్ కుమార్, కంచర్ల భూపాల్ రెడ్డి, ప్రజా సంఘాల నాయకులను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీకి సంబంధించి నేడు జరుగుతున్న ప్రజాభిప్రాయ సేకరణ ఒక ప్రహసనం అన్నారు. ప్రజల మధ్య జరపకుండా ఎక్కడో మారుమూలలో దొంగ చాటుగా రాసుకోడానికి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మా అభిప్రాయాలు చెప్పడానికి వెళ్తున్న ప్రజా ప్రతినిధులను అడ్డగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలను,

2లో

## వయనాడ్ ప్రజలు
# తన కుటుంబ సభ్యులే


- వారికి సేవ చేసేందుకే ఇక్కడికి వచ్చా
- రాజకీయాల కోసం ఇక్కడి రాలేదు
- వయనాడ్ ర్యాలీలో ప్రియాంక వెల్లడి
- కాంగ్రెస్ అగ్రనేతల సమక్షంలో నామినేషన దాఖలు
- తనలాగే చెల్లిని ఆదరించాలని రాహుల్ పిలుపు



తిరువనంతపురం, (అక్టోబర్ 23) : వయనాడ్ ప్రజలు తన కుటుంబ సభ్యులతో సమానమని కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. వయనాడ్ ఉప ఎన్నిక నేథ్యంలో ఇక్కడి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా

2లో

# ఇచ్చిన మాటకోసం
## శ్రీరాములును ఎమ్మెల్యే చేశా



బళ్లారి (అక్టోబర్ 23) : 'మాజీ మంత్రి శ్రీరాములు నాన్నకు మాట ఇచ్చాను... శ్రీరాములును ఎమ్మెల్యేగా చేస్తానని ఆరోజు ఇచ్చిన మాట నిలుపుకున్నాను అని మాజీ మంత్రి, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి అన్నారు. హవ్వంబావిలోని గాలి జనార్దన్‌రెడ్డి కార్యాలయంలో బీజేపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సండూరు ఎన్నికల్లో దివాకర్‌కు టికెట్ వస్తుందని ఆశించాం. కానీ బీజేపీ అధిష్టాన వర్గం టికెట్ ఇవ్వలేదు. ఇదొక మంచికేనేమో అని అన్నారు. ఎందుకంటే రాబోయే రోజుల్లో దివాకర్ మంత్రి కూడా కావచ్చు అని జోస్యం చెప్పారు. బహుబలి సినిమా కథను వివరింస్తూ ప్రజలు నన్ను ఎప్పుడూ మెచ్చుకుంటారని చెప్పారు. సండూరు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంత గెలుపునకు ప్రతి కార్యకర్త పనిచేయాలని కోరారు. అటల్‌బిహర్ వాజ్‌పే, యడ్యూరప్ప, ఇతర పెద్ద పెద్ద నాయకులు పదవులు రావడానికి చాలా కష్టపడ్డారని తెలిపారు.

2లో

## నీ తాటాకు చప్పళ్లకు
# భయపడే వాళ్లం కాదు

- నోటీసులకు నోటీసులతోనే సమాధానం ఇస్తున్నా
- నువ్వెంత సుద్దపూసో.. ప్రజలకు తెలుసు
- కెటిఆర్ నోటీసులపై బండి సంజయ్ ఘాటు సమాధానం



హైదరాబాద్, (అక్టోబర్ 23) : లీగల్ నోటీసులతో భయపెట్టాలని చూస్తే ఇక్కడ భయపడే వారెవరూ లేరని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పంపిన లీగల్ నోటీసులపై ఆయన స్పందించారు. నన్ను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక లీగల్ నోటీసులు ఇవ్వడం చూస్తుంటే జాలేస్తోంది. తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు. నాపై తొలుత వ్యక్తిగత ఆరోపణలు చేసి అవమానించింది కేటీఆరే. అందుకు బదులుగానే నేను మాట్లాడాను. ఆయన బాగోతం ప్రజలకు తెలుసు. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్ కేసు

2లో




## ప్రజాభిప్రాయమని చెప్పి
# అడ్డుకుంటారా

- బిఆర్ఎస్ నేతల అరెస్ట్‌పై మండిపడ్డ కెటిఆర్
- కాంగ్రెస్ నియంతృత్వంగా వ్యవహరిస్తోందని విమర్శలు

హైదరాబాద్, (అక్టోబర్ 23) :రామన్నపేటలో దొంగచాటుగా నిర్మించ తలపెట్టిన అదానీ-అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీపై నిర్వహిస్తున్న పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణకు బీఆర్ఎస్

2లో

# సంపాదకీయం

## 'మహా' యుద్ధంలో గెలుపు ఎవరిది?

హరియాణా ఎన్నికల ఫలితాల తర్వాత సర్వేలు నిర్వహించేవారు చాలా స్తబ్దంగా కనపడుతున్నారు. నవంబర్ 20న జరిగే మహారాష్ట్ర ఎన్నికల గురించి అడిగితే చాలా ఆచితూచి స్పందిస్తున్నారు. సర్వేలు నిర్వహించేవారు మాత్రమే కాదు, ఎగ్జిట్‌పోల్స్ నిర్వహించేవారికి కూడా ఏమీ అంతుబట్టడం లేదు. మహారాష్ట్రలో వారు యథా ప్రకారం ఎగ్జిట్‌పోల్స్ నిర్వహించే సాహసం చేస్తారా లేదా అన్నది చెప్పలేం. హరియాణాలో బీజేపీ హ్యాట్రిక్ సాధిస్తుందని ఒక్క సర్వే కానీ, ఎగ్జిట్‌పోల్స్ కానీ వెల్లడించలేదు. అదే విధంగా జమ్ముకశ్మీర్‌లో హంగ్ అసెంబ్లీ ఏర్పడుతుం దని అంచనా వేసినవారు కూడా నేషనల్ కాన్ఫరెన్స్–కాంగ్రెస్ కూటమి మెజారిటీ సీట్లు సాధిస్తుందని ఊహించలేకపోయాయి. ఇప్పుడే కాదు, 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూడా ఎగ్జిట్‌పోల్స్ నిర్వహించిన 12 సంస్థలు ఎన్డీఏ 400 సీట్లు దాటుతుందని చెప్పి బోల్తా పడ్డాయి. అసలు మన దేశంలో ఎగ్జిట్‌పోల్స్, సర్వే సంస్థలు ఎందుకు విశ్వసనీయత కోల్పోతు న్నాయి? గల్లీకొక్కటిగా పుట్టగొడుగుల్లా ఏర్పడిన సంస్థల గురించి పెద్దగా మాట్లాడనక్కర్లేదు కాని ఒకప్పుడు కచ్చితంగా అంచనా వేయగలవని గుర్తింపు తెచ్చుకున్న సంస్థలు కూడా ఎందుకు విఫలమవుతున్నాయి? వాటిలో వృత్తి నైపుణ్యం లోపించిందా? లేదా ఈ సంస్థలు కూడా సోషల్ మీడియా సంస్థల్లాగా గాలివాటంగా జనంలో వినపడుతున్నది బయటకు వదిలేస్తున్నాయా? అన్న అనుమానం వస్తోంది. యూట్యూబ్‌ల్లో సర్వేరాయుళ్లు, ఏదో ఒకటి మాట్లాడే విశ్లేషకులు ఆవిర్భవించాక వారిని కూడా మేనేజ్ చేసే నేతల పీఆర్ బృందాలు బయలుదేరాయి. 'మీరు ఆయనను గొప్ప విశ్లేషకుడు అనుకుంటారు.. ఆయనకు గత ఎన్నికల్లో ఎంత చెల్లించామో తెలుసా?' అని రాష్ట్రంలో ఒక నేతకు పనిచేసిన పీఆర్వో ఒకరు అడిగారు. అందువల్ల మనకు వచ్చే సమాచారం విశ్వసనీ యతను గ్రహించడం చాలా కష్టం. రాజకీయ నాయకులు తమ పార్టీని, అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రైవేట్ సంస్థల్ని నియమించుకుని విజయం కోసం ప్రయత్నించే ప్రక్రియ మన దేశ రాజకీయాల్లో ఆలస్యంగా ప్రవేశించింది. కాని సంస్థల్ని నిర్వహించే వ్యూహకర్తల విశ్వసనీయత కూడా క్రమక్రమంగా తగ్గడం ప్రారంభమైంది. గత ఎన్నికల్లో ఏపీలో వైసీపీ తాను అఖండ విజయం సాధిస్తానని భావించింది. తమ తరఫున వ్యూహరచన చేసిన సంస్థ ప్రతినిధులను వైసీపీ అధినేత ఫలితాలు రాకముందే సత్కరించారు. కాని వైసీపీ ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయింది. కర్ణాటక, తెలంగాణల్లో కాంగ్రెస్‌లో చక్రం తిప్పిన ఒక ప్రైవేట్ వ్యూహకర్తకు సలహాదారుగా కేబినెట్ హోదా కూడా కల్పించారు. నేతలు టిక్కెట్ల కోసం ఆయన చుట్టూ తిరిగారు. కాని రాజస్థాన్, మధ్యప్రదేశ్, హరియాణాలో ఆయన వ్యూహం ఫలించలేదు. సర్వేల ఆధారంగా టిక్కెట్లు పొందినవారు అనేకమంది పరాజయం పాలయ్యారు. ఇందుకు వ్యూహ కర్తనే తప్పుపట్టలేం కాని ఇలా ఎందుకు జరుగుతోంది? నిజానికి ఏపీలో ఏ వ్యూహకర్తతో నిమిత్తం లేకుండా ప్రజలు తీర్పు చెప్పారు. తెలంగాణలో కూడా కేసిఆర్ చేసిన తప్పిదాల వల్ల బీఆర్ఎస్ ఓటమి పాలైందని స్పష్టంగా తేలింది కాని ఏ వ్యూహకర్తవల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిం దని చెప్పలేం. ప్రజలు వ్యూహకర్తలతో నిమిత్తం లేకుండా ప్రభుత్వ పాల నపై, రాజకీయ పార్టీల తీరుతెన్నులపై ఆధారపడి తీర్పునిస్తారన్న విషయం అనేక సందర్భాల్లో వెల్లడైంది. ఎమర్జెన్సీ తర్వాత జనతా పార్టీ విజయానికి ఏ వ్యూహకర్తా కారణం కాలేదు. 2014లో నరేంద్రమోదీ నేతృత్వంలో బీజేపీ ప్రభంజనానికి కానీ, 2024లో బీజేపీ సీట్లు తగ్గడానికి కూడా పూర్తిగా వ్యూహకర్తలు కారణమని చెప్పలేము. కాకపోతే ఒక పార్టీకి ప్రజాభిప్రాయం అనుకూలంగా ఉంటే ఆ వాతావరణాన్ని సంఘటితం చేసేందుకు కొన్ని సంస్థలు తోడ్పడవచ్చు కాని ఈ సంస్థలే రాజకీయ పార్టీల తలరాతల్ని నిర్ణయించలేవు. అందువల్ల నేతలు ఎప్పుడూ ప్రజలతో నిత్యసంబంధాలు ఏర్పర్చుకుంటూ, వారికోసం పనిచేస్తూ ఉండక తప్పదు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల్లో మహారాష్ట్ర లో ఏ కూటమి గెలుస్తుంది అన్న విషయంపై అనేకమంది రాజకీయ పరిశీలకుల్లోనే అయోమయం నెలకొన్నది. నాలుగు నెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 48 సీట్లలో కేవలం 9 సీట్లలోనే బీజేపీ విజయం సాధిస్తే ఏకనాథ్ షిండే నేతృత్వంలోని శివసేనకు 7, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి ఒక సీటు లభించాయి. మరో వైపు కాంగ్రెస్‌కు 12, ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేనకు 9, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి 8 సీట్లు లభించాయి. ఉత్తరప్రదేశ్‌లో మాదిరి మహారాష్ట్రలో కూడా మోదీ ప్రభంజనం అంతగా పనిచేయ లేదు. గత ఎన్నికలతో పోలిస్తే బీజేపీ ఈ ఎన్నికల్లో 12 సీట్లు కోల్పో యింది. దేశంలో రెండుసార్లు బీజేపీకి పూర్తి మెజారిటీ సాధించిన సందర్భాల్లో కూడా మోదీ మహారాష్ట్రలో సంకీర్ణ ప్రభుత్వం రాకుండా చేయలేకపోయారు.

## ప్రజాభిప్రాయ సేకరణ ఓ ప్రహసనం

ప్రజాసంఘాల నాయకులను, ప్రజా ప్రతినిధులను, పార్టీల నాయకులను అరెస్ట్ చేసి ఏ ప్రజల అభిప్రాయాలు తీసుకుంటారని ప్రశ్నించారు. నల్లగొండ, యాదాద్రి, రాచకొండ కమిషనరేట్ పోలీస్ అధికారులు, జిల్లా కలెక్టర్లు ఈ నిర్బందాలకు బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. రేవంత్ రెడ్డి పరిపాలనకు రోజులు దగ్గర పడ్డాయన్నారు. కోదండరాం, హరగోపాల్ ఇప్పుడైనా గొంతులు విప్పుతారా? అని నిలదీశారు. ఎటువంటి ఆటంకాలు లేకుండా ప్రజలందరూ వాళ్ల అభిప్రాయాన్ని స్వేచ్ఛగా చెప్పే వాతావరణం కల్పించి ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని డిమాండ్ చేశారు. నిర్భందించిన ప్రజా ప్రతినిధులను వెంటనే విడుదల చేయాలన్నారు.

## వయనాడ్ ప్రజలు తన కుటుంబ సభ్యులే

పోటీచేస్తున్న ప్రియాంక గాంధీ బుధవారం తన నామినేషన్ దాఖలు చేశారు. అంతకుముందు భారీ ర్యాలీ నిర్వహించిన ప్రియాంక గాంధీ, అనంతరం జరిగిన బహిరంగ సభలో కాంగ్రెస్ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. తన కొత్త ప్రయాణాన్ని వయనాడ్‌లో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. తాను రాజకీయాల కోసం ఇక్కడకు రాలేదని, ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం వయనాడ్ వచ్చినట్లు తెలిపారు. రాజకీయానికంటే ఈ దేశం ముఖ్యమన్నారు. సమానత్వం కోసం కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందన్నారు. తన సోదరుడు రాహుల్ గాంధీ దేశం మొత్తం తిరిగారని, ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు, వారి సమస్యలను తెలుసు కునేందుకు దేశ వ్యాప్తంగా పర్యటించినట్లు చెప్పారు. వయనాడ్ ప్రజలకు అండగా ఉండేందకు తాను ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు. ఇక్కడి ప్రజలతో కలిసి పోరాడేందుకు, వారి సమస్యల పరిష్కారానికి వయనాడ్‌కు వచ్చినట్లు తెలిపారు. వయనాడ్ ప్రజల తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు ఇక్కడకు వచ్చానన్నారు. రాహుల్ మాట్లాడుతూ..తనకులాగే వయనాడ్ నుంచి తన సోదరి ప్రియాంకగాంధీని ఆశీర్వదించాలన్నారు. వయనాడ్ నుంచి అధికారికంగా ఒకరు పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తే.. మరొకరు అనధికారికంగా వయనాడ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తామన్నారు. ఇక్కడి ప్రజల కోసం తాను ఎప్పటికీ పోరాడుతూనే ఉంటానన్నారు. తన తల్లి ఇక్కడ ఉన్నారని, తండ్రి చనిపోయిన తర్వాత తన సోదరి ప్రియాంక గాంధీ అమ్మను చూసుకుంటున్నార్నారు. ప్రియాంక 17 ఏళ్ల వయసులో తండ్రిని కోల్పో యిందని, అయినప్పటికీ తమ తల్లికి తోడుగా నిలిచిందని రాహుల్ తెలిపారు. ప్రియాంకగాంధీ కుటుంబం కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధమన్నారు. వయనాడ్ ప్రజలే ప్రియాంక కుటుంబమన్నారు. ఆ కుటుంబం కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధమన్నారు. వయనాడ్ ప్రజలకు తన సోదరిని అప్పగిస్తున్నానని, ప్రియాంక గాంధీని ఇక్కడి ప్రజలే రక్షించుకోవాలన్నారు. అనధికార ఎంపీగా తాను కూడా తరచూ వయనాడ్‌కు వస్తుంటానని రాహుల్ గాంధీ తెలిపారు. వయనాడ్ సభలో సోనియాగాంధీ, మల్లికార్జున్ ఖర్గేతో పాటు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు కాంగ్రెస్ సీనియర్ నేతలు పాల్గొన్నారు. వయనాడ్ ఎంపీగా కాంగ్రెస్ నుంచి ప్రియాంక గాంధీ పోటీ చేస్తుండగా.. లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) నుంచి సీపీఐకి చెందిన సత్యన్ మొకేరి, బీజేపీ నుంచి నవ్య హరిదాస్ పోటీచేస్తున్నారు. బీజేపీ అభ్యర్థి నవ్య హరిదాస్ తన రాజకీయ అనుభవం ఆధారంగా ప్రియాంక గాంధీకి సవాలు విసిరారు. సింగపూర్, నెదర్లాండ్స్‌లో పనిచేసిన నవ్య కోజికోడ్ కౌన్సిలర్‌గా ఉన్నారు. కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి బరిలోకి దిగుతున్న ప్రియాంక గాంధీ నామినేషన్ దాఖలు చేయడానికి ముందు వయనాడ్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. నామినేషన్ దాఖలు కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో పాటు ఇతర సీనియర్ నేతలు పాల్గొనగా.. ర్యాలీలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. భారీ సంఖ్యలో హాజరైన కాంగ్రెస్ కార్యకర్తలకు, అభిమానులకు అభివాదం చేసుకుంటూ ప్రియాంక, రాహుల్ ముందుకుసాగారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ర్యాలీలో రాహుల్, ప్రియాంక ఉత్సాహంగా కనిపించారు. మధ్యలో కాంగ్రెస్ శ్రేణులకు రాహుల్ ఫ్లయింగ్ కిస్ ఇచ్చారు. అలాగే రాహుల్, ప్రియాంక తన ర్యాలీ దృశ్యాలను స్వయంగా ఫోన్‌లో చిత్రీకరించారు. ర్యాలీకి ముందు పార్టీ నాయకుల సమక్షంలో ప్రియాంక గాంధీ నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. ర్యాలీ తర్వాత పార్టీ కార్యకర్తలు, అభిమానుల ను ఉద్దేశించి ప్రియాంక గాంధీ ప్రసంగించారు. వయనాడ్ ప్రజలకు సేవ చేసేందుకు తాను ఇక్కడి నుంచి పోటీచేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీచేస్తున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేస్తారని ప్రచారం జరిగినా ఆమె పోటీకి దూరంగా ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థుల తరపున ప్రచారం మాత్రమే నిర్వహించారు. వయనాడ్ లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నిక నేపథ్యంలో ఆమె ఇక్కడి నుంచి పోటీచేస్తున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్ గాంధీ వయనాడ్, రాయబరేలీ స్థానాల నుంచి పోటీచేయగా.. రెండు చోట్ల విజయం సాధించారు. దీంతో వయనాడ్ స్థానానికి ఆయన రాజీనామా చేశారు. దీంతో వయనాడ్ ఉప ఎన్నికకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. నవంబర్13న ఇక్కడ పోలింగ్ జరగనుంది. 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆమె క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చారు. అప్పటి నుంచి ప్రియాంక గాంధీ పార్టీ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రియాంక గాంధీ ఎంపీగా గెలిస్తే సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక కలిసి పార్లమెంటులో అడుగుపెట్టడం ఇదే మొదటిసారి అవుతుంది.

## శ్రీవారిని దర్శించుకున్న సీతక్క

అనంతరం రంగనాయకుల మండపంలో ఆలయ పండితులు మంత్రి సీతక్కు వేదాశీర్వచనం అందించగా, అధికారులు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. పని ఒత్తిడి వల్ల మొక్కులు చెల్లించుకోవడం ఆలస్యమైందని చెప్పారు. వయనాడ్‌లో ప్రియాంక గాంధీ గెలవాలని కోరుకున్నట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. కాగా, తిరుమలలో తెలంగాణకు చెందిన ప్రజాప్రతినిధులపై టీటీడీ అధికారులు చిన్నచూపు చూస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంటక్ ఆరోపించారు. సోమవారం ఇరువురు నేతలు కలిసి తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లారు. అయితే తిరుమలలో తమకు సరైన గౌరవం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఏపీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు భద్రాచలం, యాదాద్రి ఆలయానికి వచ్చినప్పుడు వారికి ప్రొటోకాల్ అమలవుతోందన్నారు. కానీ తెలంగాణ ఎమ్మెల్యేలపై తిరుమలలో ఎందుకు చిన్నచూపు అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజా ప్రతినిధులు సిఫార్సు చేస్తే కనీసం గదులు కూడా ఇవ్వరా అని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రశ్నించారు. ఏపీ సీఎం చంద్రబాబు మాత్రం తనకు తెలుగు రాష్ట్రాలు రెండు కళ్లలాంటివని చెబుతారు, కానీ తిరుమలలో తెలంగాణ నేతల పరిస్థితి అందుకు భిన్నంగా ఉందన్నారు. టీడీపీ, వైసీపీ నేతలు తెలంగాణలో వ్యాపారాలు చేసుకోవచ్చా, ఏపీ ఎమ్మెల్యేలను రానివ్వకుండా మేం కూడా అడ్డుకోవాలా అన్నారు. తెలంగాణ ఆలయాల్లో ఏపీ ప్రజాప్రతినిధులకు ప్రొటోకాల్ లేకుండా ఉండాలన్నారు.

## నీ తాటాకు చప్పుళ్లకు భయపడే వాళ్లం కాదు

వ్యవహారంలో ఏం జరిగిందో, ఆ కేసులను ఏ విధంగా నీరుగార్చారో తెలుసు. ఇప్పటి వరకు మాటకు మాటతోనే బదులిచ్చాను. లీగల్ నోటీసులకు నోటీసులతోనే బదులిస్తా. మేం చట్టాన్ని, న్యాయాన్ని గౌరవించే వ్యక్తులం. చట్టం, న్యాయం ప్రకారం ముందుకు వెళ్తాం అని అని బండి సంజయ్ పేర్కొన్నారు. తన పరువుకు నష్టం కలిగించేలా వ్యాఖ్యలు చేశారంటూ కేంద్రమంత్రి బండిసంజయ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లీగల్ నోటీసు పంపిన విషయం తెలిసిందే. తాజాగా కేటీఆర్ లీగల్ నోటీసుపై కేంద్రమంతి ఘాటైన జవాబిచ్చారు. తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు. రాజకీయంగా ఎదుర్కోలేక నోటీసులా.. విమర్శలకు నోటీసులే సమాధానమా.. అయితే నీకు నోటీసులు పంపుతా... కాచుకో. నువ్వు సుద్దపూస అనుకుంటున్నవా.. నన్ను అవమానిస్తూ మాట్లాడితేనే బదులిచ్చిన. మాటకు మాట... నోటీసుకు నోటీసుతోనే జవాబిస్తా అంటూ ఘాటుగా సమాధానం ఇచ్చారు. మాజీ మంత్రి కేటీఆర్ తనకు లీగల్ నోటీసు పంపినట్లు మీడియాలో చూసినట్లు తెలిపారు. లీగల్ నోటీసుతో భయపెట్టాలని చూస్తే ఇక్కడ భయపడే వారెవరూ లేరన్నారు. తనను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక లీగల్ నోటీస్ ఇవ్వడం చూస్తుంటే జాలేస్తోందని... స్పష్టం చేశారు. తనపై తొలుత వ్యక్తిగత ఆరోపణలు చేసి అవమానించింది కేటీఆరే అని చెప్పుకొచ్చారు. అందుకు బదులుగానే మాట్లాడినట్లు తెలిపారు.కేంద్రమంత్రి బండి సంజయ్‌కు మాజీ మంత్రి కేటీఆర్ లీగల్ నోటీసులు ఇచ్చారు. తన పరువుకు నష్టం కలిగేంచేలా వ్యాఖ్యలు చేశారని .. వారం రోజుల్లో బేషరతుగా క్షమాపణలు చెప్పకపోతే లీగల్ యాక్షన్ తప్పదని హెచ్చరించారు. అక్టోబర్ 19న బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ.. తనపై తప్పుడు ఆరోపణలు చేశారని కేటీఆర్ తన నోటీసుల్లో పేర్కొన్నారు. తాను డ్రగ్స్ తీసుకుంటానని, బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డానని నిరాధారణ ఆరోపణలు చేశారన్నారు.

## టెర్రర్ ఫండింగ్‌పై ద్వంద్వ ప్రమాణాలు.. చైనాకు మోదీ చురకలు

అడ్డుకోవాలని అన్నారు. అంతర్జాతీయ తీవ్రవాదంపై యూఎన్ కాంప్రహెన్సివ్ కన్వెన్షన్‌లో ప్రస్తావించిన పెండింగ్ అంశాలపై కూడా అంతా కలిసికట్టుగా పనిచేయాలని సభ్యదేశాలకు మోదీ పిలుపునిచ్చారు. సైబార్ సెక్యూరిటీ అనేది కీలకమని, సైబర్ సెక్యూరిటీ, సేఫ్, సెక్యూర్ ఏఐపై అంతర్జాతీయ రెగ్యులేషన్సపై సభ్యదేశాలు కలిసకట్టుగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మోదీ అన్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి, డబ్ల్యూటీఓ వంటి గ్లోబల్ సంస్థల్లో కూడా ఎప్పటికప్పుడు సంస్కరణలు తెచ్చేందుకు ముందుకు రావాలని సూచించారు. చర్చలు, దౌత్యానికి భారత్ బాసటగా నిలుస్తుందని, యుద్ధానికి కాదని ప్రధాని మరోసారి స్పష్టం చేశారు. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం, ఆహారం, నీరు, ఇంధనం, ఆరోగ్యం వంటి అంశాలు అన్ని దేశాలకు ప్రాధాన్యతాంశాలని అన్నారు. 'బ్రిక్స్' అంటే విభజన గ్రూప్ కాదని, పబ్లిక్ ఇంట్రస్ట్ గ్రూప్ అనే స్పష్టమైన సందేశాన్ని ప్రపంచ దేశాలకు మనం ఇవ్వాలని అన్నారు.

కొత్త దేశాలకు స్వాగతం

బ్రిక్స్ భాగస్వా దేశంగా కొత్త కొత్తదేశాలకు స్వాగతం పలికేందుకు ఇండియా సిద్ధంగా ఉందని మోదీ స్పష్టం చేశారు. అయితే ఇందుకు సంబంధించిన నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా తీసుకోవాల్సి ఉంటుందన్నారు. బ్రిక్స్ వ్యవస్థాపక దేశాల అభిప్రాయాలను గౌరవించాల్సి ఉంటుందన్నారు. జోహెన్నెస్‌బర్గ్ సమ్మిట్‌లో అంగీకరించిన సిద్ధాంతాలు, ప్రమాణాలు, క్రైటీరియా, ప్రొసీజర్‌ను తూచ తప్పకుండా సభ్యదేశాలు పాటిస్తూ ముందుకు వెళ్లాలని దిశానిర్దేశం చేశారు.

## ప్రజాభిప్రాయమని చెప్పి అడ్డుకుంటారా

నేతలు వెళ్లకుండా ఎక్కడికక్కడ అడ్డుకోవడం, హౌజ్ అరెస్టులు చేయడం దుర్మార్గమైన చర్య అని పార్టీ వర్కింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ నాయక్, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్ రెడ్డిని హౌస్ అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్ కుమార్, చిరుమర్తి లింగయ్యలు ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడం నియంతృత్వం కాక మరేంటని ప్రశ్నించారు. వీరితోపాటు ప్రజాసంఘాల ప్రతినిధులు, పర్యావరణవేత్తలను ముందస్తు అరెస్టులు చేసి భయభ్రాంతులకు గురిచేయడం రేవంత్ సర్కారు అణచివేత విధానాలకు నిదర్శనమని చెప్పారు. ఇంతటి నిర్బంధ పరిస్థితులను సృష్టించి నిర్వహించే పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణకు విలువ ఉండదన్నారు. ఇది ముమ్మాటికీ అదానీ ఆదేశాలతో ముఖ్యమంత్రి రేవంత్ సాగిస్తున్న అరాచక పర్వమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమంగా నిర్బంధించిన బీఆర్ఎస్ నాయకులతో పాటు ప్రజాసంఘాల నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ సర్కారుకు దమ్ముంటే ఎలాంటి నిర్బంధాలు లేకుండా ప్రజాభిప్రాయ సేకరణ జరపాలన్నారు. అప్పుడే గుండెపగిలిన రైతుల ఆవేదన, చుట్టుపక్కల ప్రజల ఆక్రందన ఏ స్థాయిలో ఉందో తెలుస్తుందని చెప్పారు. నియంతృత్వ విధానాలతో ప్రజాభిప్రాయ సేకరణను మమ అనిపించి అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ విషయంలో ముందుకెళ్లే ప్రయత్నం చేస్తే కాంగ్రెస్ సర్కారుకు ప్రజలే మరణశాసనం రాస్తారని తెలిపారు.

## ఇచ్చిన మాటకోసం శ్రీరాములును ఎమ్మెల్యే చేశా

నాకు కూడా ఇంకా వయస్సు ఉంది. ఇంకా పదేళ్ల వరకూ నేను గట్టిగానే ఉంటాను అన్నారు. నమ్ముకున్న ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తానని చెప్పారు. సండూరు ఉప ఎన్నికలు ఖచ్చితంగా విజయం సాధిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు కార్యర్తలు పాల్గొన్నరు.

## హెచ్‌సీఏ వివాదాలపై సుప్రీంకోర్టులో విచారణ

ఆశ్రయించారు. వారి పిటిషన్లపైనే ప్రస్తుతం కోర్టులో విచారణ జరుగుతోంది. కాగా హెచ్‌సీఏలో కుటుంబ సభ్యులే ఎక్కువ మంది మెంబర్లుగా ఉన్నారని సుప్రీంకోర్టు దృష్టికి జస్టిస్ నాగేశ్వరరావు తీసుకెళ్లారు. కుటుంబ సభ్యులు ఎక్కువగా ఉండడంతో హెచ్‌సీఏ ఎన్నికల నిర్వహణలో పలు అంశాలు ప్రభావితం అవుతున్నాయని ఆయన చెప్పారు. అయితే మెంబర్లు మాత్రం ఈ వాదనను వ్యతిరేకిస్తున్నారు.

హెచ్‌సీఏపై ఆరోపణలు

హెచ్‌సీఏలో కాంట్రాక్టుకు సంబంధించిన అంశాలపై దర్యాప్తు జరపాలనే డిమాండ్ గత కొంతకాలంగా వినిపిస్తున్నాయి. టెండర్ ప్రక్రియ, క్యాటరింగ్, ట్రావెలింగ్ సర్వీసులతో పాటు ఇతర అంశాలపై సమగ్ర అంశాలు బయటకు తీయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ అంశంపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి ఇటీవలే స్పందించారు. హెచ్‌సీఏకి సంబం ధించిన పలు అంశాలపై దర్యాప్తు జరపాలంటూ విజిలెన్స్ అదనపు డీజీకి లెటర్ రాశారు. హెచ్‌సీఏ యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటోం దని చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఈ విధంగా నిర్ణయాలు తీసుకోవడం అసోసియేషన్ పనితీరును ప్రభావితం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. కీలకమైన అపెక్స్ కౌన్సిల్‌తో అవసరం మేరకు సంప్రదింపులు జరపకుండా కొంతమందే నిర్ణయాధికారాలు (ప్రెసిడెంట్, సెక్రటరీ) తీసు కుంటున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక



## పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన దయాకర్ రెడ్డి

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:** ముదిగొండ మండలంలోని లక్ష్మీపురంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. అవకాశాన్ని రైతు సోదరులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, దేవరపల్లి అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఖమ్మం రూరల్ మండలం చల్లపల్లి గార్డెన్స్ లో జరిగిన చల్లపల్లి రాధమ్మ దశదిన కర్మలో పాల్గొన్నారు. ఆమె చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించారు.

## మరణించిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి 2000 బ్యాచ్ కానిస్టేబుళ్ల ఆర్థిక సహాయం



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:** సెప్టెంబర్ 21 న కొణిజర్ల పోలీస్ స్టేషన్ విధి నిర్వహణలో వున్న 2000 బ్యాచ్ కు చెందిన హెడ్ కానిస్టేబుల్ ఈ.లోకేష్ అకస్మాత్తుగా వచ్చిన గుండెపోటుతో మరణించారు. ఈ నేపథ్యంలో మృతిని కుటుంబ సభ్యులకు ఖమ్మం ఉమ్మడి జిల్లాకు చెందిన తోటి బ్యాచ్ పోలీస్ సిబ్బంది తమవంతు సహాయంగా 2,00,000/- ఆర్థిక సహాయాన్ని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చేతుల మీదుగా అందించారు. అందరితో కలివిడిగా ఉండే వ్యక్తి అకస్మాత్తుగా దూరమయ్యాడం... ఆయన్నే నమ్ముకున్న ఆ కుటుంబం రోడ్డున పడవద్దని... తోటి మిత్రులు ఒక్కటయ్యారు. ఆ కుటుంబానికి తామున్నామని అండగా నిలిచారు. తలా కొంత చేయి వేసి పిల్లల భవిష్యత్తుకు తమవంతు భరోసా కల్పించారు. బుధవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కుటుంబ సభ్యులకు చెక్కు ను అందజేశారు.

## మానవ హక్కుల సంఘం మహిళా కమిటీ ఎంపిక



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:** మానవ హక్కుల సంఘం మహిళా విభాగాన్ని జాతీయ చైర్మన్ శ్రీనివాసరావు ఎంపిక చేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో రోజు రోజుకు మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులు , వేధింపులు మరియు పెరిగిపోతున్న మత్తు పదార్థాల వినియోగన్ని అరికట్టేందుకు ప్రభుత్వ సహకారంతో మానవ హక్కుల సంఘం కూడా ఉంటుందని అన్నారు . ఈ సందర్భంగా మానవ హక్కుల సంఘం మహిళా విభాగాన్ని ఆయన ఎంపిక చేసి ప్రకటించారు . జిల్లా చైర్మన్ గా మాదినేని లక్ష్మి , అధ్యక్షురాలిగా దామ స్వరూప , కార్యదర్శిగా చింతల సుజాత ను ఎంపిక చేయడంతో పాటు దక్షిణ భారత దేశ కమిటీ కూడా ప్రకటించారు . దక్షిణ భారత దేశ చైర్మన్ గా కనకబండి విజయలక్ష్మి , వైస్ చైర్మన్ గా పరిమి అనంతలక్ష్మి , సహాయ కార్యదర్శి గా కనగంటి నాగమణి , రాష్ట్ర చైర్మన్ గా చావా శాంతి , సహాయ కార్యదర్శిగా మాలోజి ప్రేమ కుమారి లను ఎంపిక చేశారు . నూతనంగా ఎంపికైన మహిళా సంఘం నేతలు మాట్లాడుతూ మాపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను శక్తి వంచన లేకుండా , తనపర భేదాలు లేకుండా ఎల్లప్పుడూ దేశంలో జరుగుతున్న అన్యాయాలపై , మహిళపై జరుగుతున్న దాడులపై పోరాడుతామని తెలిపారు .

## మాదిగల ధర్మయుద్ధ మహాసభకు ప్రజలు భారీగా తరలిరావాలి

### ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు




ఈనెల 30న జడ్చర్లలో మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే మాదిగల ధర్మ యుద్ధ మహాసభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని వనపర్తి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం గోపాల్పేట మండలం పవన్ కళ్యాణ్ మాదిగ ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. సందర్భంగా కొమ్ము చెన్న కేశవులు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ చర్యంతవరకు ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలని, మాదిగ జాతికి అనగద్రొక్కే చర్య, కుట్రపూరితమైన చర్యలను నిలిపివేలని డిమాండ్ చేశారు. దీనిని మాదిగ ప్రజలందరూ ఎదుర్కోవాలి. అందుకోసం అందరం సిద్ధమవుదామా పిలుపునిచ్చారు. మొదటి విడతగా మందకృష్ణ మాదిగ పర్యటనలో భాగంగా మాదిగల ధర్మ యుద్ధ మహాసభలను పెద్ద ఎత్తున విజయవంతం చేద్దామని కోరారు. మాదిగ విద్యార్థులారా.. నిరుద్యోగులారా అన్న వస్తున్నాడు కందిరండి. ఈ కార్యక్రమంలో బహుజన సోషలిస్టు పార్టీ జిల్లా కో కన్వీనర్ గట్టు స్వామి మాదిగ, అడ్డకుల రాజేందర్ మాదిగ, చెన్నయ్య మాదిగ, శరత్ మాదిగ, శివ మాదిగ, రామకృష్ణ మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఒకవైపు తండ్రి మరణం ఒక వైపు కొడుకు జననం ఏం జరిగిందో తెలియని తల్లి కొడుకు



**తెలంగాణ ముచ్చట్లు జోగులాంబ గద్వాల్ జిల్లా అల్లంపూర్ ప్రతినిధి :** కోటి ఆశలు పెట్టుకున్నారు. ఇక జీవితం హ్యాపీగా సాగిపోతుందని ఉహించుకున్నారు. ఇంతలోనే విధి వక్రించి భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. భర్త చనిపోయిన ఒక గంట వ్యవధిలోనే అతడి భార్య పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఓవైపు తండ్రి మరణం..మరోవైపు కుమారుడి జననం. ఈ హృదయవిదారక ఘటన రాజోలి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకివెళ్తే తుమ్మలపల్లె గ్రామానికి చెందిన కుర్వ శివ (28) గత ఒక సంవత్సరం క్రిందట బేతంచెర్ల పట్టణానికి చెందిన కుర్వ లక్ష్మితో వివాహం అయ్యింది. శివ తన కుటుంబ పోషణ కోసం పెట్రోల్ బంకుల్లో పనిచేస్తున్నాడు. లక్ష్మి గర్భం దాల్చడంతో వారి పుట్టింట్లో ఉంటూ..మంగళవారం లక్ష్మికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు కర్నూల్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో జాయిన్ చేశారు. మంగళవారం రాత్రి తుమ్మలపల్లి గ్రామం నుండి శివ తన వ్యక్తిగత పనుల కోసం ద్విచక్ర వాహనంపై రాజోలికి వెళ్తుండగా మార్గమధ్యలో ప్రమాదవశత్తు బైకు అదుపుతప్పడంతో శివ తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్సుకు సమాచారం ఇవ్వడంతో కర్నూలు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి 1 గంటలకు మృతి చెందాడు. మరోవైపు 2 గంటలకు తన భార్య లక్ష్మి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. భర్త చనిపోయిన విషయం చెబితే లక్ష్మికి ఏమవుతుందోనని కుటుంబసభ్యులు ఆమెకు చెప్పలేదు. కర్నూలు జిల్లా నుంచి శివ మృతదేహాన్ని రాజోలికి తరలించి ఆమెకు తెలియకుండానే అంతిమ సంస్కారాలు నిర్వహించారు. తన భర్త చనిపోయాడన్న విషయం తెలియని లక్ష్మికి కొడుకు పుట్టిన ఆనందంలో మునిగిపోయింది. శివ ఎప్పుడు వస్తాడా.. అతడికి ఎప్పుడు బాబును చూపించాలా.. అని ఆమె ఆసుపత్రిలో ఎదురుచూస్తోంది. ఆమె పరిస్థితి చూసి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. మృతుడి తండ్రి కుర్వ పెద్ద మద్దిలేటి ఫిర్యాదు మేరకు రాజోలి ఎస్ఐ జగదీశ్వర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## మైనర్ బాలికపై సిఐ రవికుమార్ అత్యాచార యత్నం

### - బాలిక తల్లిదండ్రుల పిర్యాదుతో కేసు నమోదు చేసిన ఖాజీపేట్ పోలీసులు

### - సిఐ పై పోక్సో చట్టం కింద కేసు నమోదు




**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది.ఓ బాలికపై సీఐ రవికుమార్ అత్యాచారయత్నం చేశారు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి బుధవారం ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఇంటికి రాగానే తల్లిదండ్రులకు బాలిక జరిగిన విషయం చెప్పడంతో, హుటాహుటిన వెళ్లి కాజీపేట పోలీసులకు కంప్లైంట్ చేశారు. సీఐపై లైంగిక వేధింపులు, పోక్సో కేసు నమోదు చేశారు. ప్రస్తుతం సీఐ పరారీలో ఉన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సమాజంలో అత్యాచార ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాల్సిన పోలీసులే దారుణాలకు పాల్పడటం ఏంటని స్థానిక రాజకీయ నాయకులు మండిపడుతున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.సిఐ రవికుమార్ గతంలో మామునూరు,మడికొండ పోలీస్టేషన్ లో విధులు నిర్వహించారు.



## పోలీస్ అమర వీరుల దినోత్సవం సందర్భంగా రక్తదానం చేసిన విద్యార్థి నేతలు

**వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు:** వనపర్తి జిల్లా కేంద్రంలోని, పోలీస్ ప్రధాన కార్యాలయం, ఎస్పీ కార్యాలయం ఆవరణలో, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరంలో టిజివిపి జిల్లా అధ్యక్షుడు రవియాదవ్ ఆధ్వర్యంలో, నలబై మంది పాల్గొని, రక్త దానం చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన విద్యార్థి సంఘాలను ఉద్దేశించి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ, రక్తదానం ప్రాణదానం, రక్తదానంపై అపోహలు వద్దని జిల్లా ఎస్పీ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా అమరులైన పోలీస్ అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ వారి కుటుంబాలకు పోలీస్ శాఖ తరపున ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వనపర్తి జిల్లా విద్యార్థి సంఘం నేతలను జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీస్ గారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో, గణేష్, అచ్చిరెడ్డి, విష్ణు, రమేష్, కిషోర్ గణేష్, మహేష్, రఘు, జగదీష్, శ్రీను తదితరులు పాలుగోన్నారు.

## సుభాష్ గౌడ్ మృతి గౌడ కులస్తులకు తీరని లోటు

### - సుభాష్ గౌడ్ ఆశయాలను కొనసాగించాలి

### - గౌడ సంఘాల జేఏసీ చైర్మన్, బైరి రవికృష్ణ గౌడ్




**హసన్ పర్తి తెలంగాణ ముచ్చట్లు :** సీనియర్ ఆంధ్రజ్యోతి జర్నలిస్ట్ నాయకపు సుభాష్ గౌడ్ మృతి గౌడ సమాజానికి,జర్నలిస్టులకు తీరని లోటని గౌడ సంఘాల జేఏసీ చైర్మన్ బైరి రవికృష్ణ గౌడ్ అన్నారు. గ్రేటర్ వరంగల్ భీమారంలోని డివిఆర్ ఫంక్షన్ హాల్ లో బుధవారం గౌడ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సుభాష్ గౌడ్ సంతాప సభ నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బైరి రవికృష్ణ గౌడ్ మాట్లాడుతూ సమాజములో నిబద్ధతతో పనిచేసే విలువలున్న వ్యక్తి సుభాష్ గౌడ్ అని కొనియాడారు. సుభాష్ గౌడ్ అంకితభావం ఉన్న జర్నలిస్ట్ అని గౌడ కులస్తులకు ఏ ఆపద వచ్చిన అండగా ఉంటూ పరిష్కరించేవాడని పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి గౌడ సంఘాల జేఏసీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోనగాని యాదగిరి గౌడ్, గోపా హన్మకొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చిర్ర రాజు గౌడ్, బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్ గౌడ్, గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర, జిల్లా నాయకులు పెద్ది వెంకట్ నారాయణ గౌడ్, తాళ్లపెల్లి జనార్దన్ గౌడ్, మార్క రవి గౌడ్, వల్లల జగన్ గౌడ్, నకరికంటి మోహన్, కాసగాని అశోక్ గౌడ్,బత్తిని రమేష్ గౌడ్, పులి మోహన్ గౌడ్, పెరుమాండ్ల అనిల్ గౌడ్, బానుప్రకాష్, చిర్ర సుమన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఐ,ఎస్ ఐ తో భేటీ అయిన బ్యాంకు మేనేజర్స్

**తిరువూరు, తెలంగాణ ముచ్చట్లు :** విజయవాడ సీపీ రాజశేఖర్ బాబు అదేశముల మేరకు తిరువూరు బ్యాంకు మేనేజర్స్ తో తిరువూరు సీఐ గిరిబాబు, ఎస్ ఐ కె.వి.జి.వి సత్యనారాయణ మీటింగ్ జరిపి విదేశాల్లో పిల్లలు ఉన్న తల్లి దండ్రులను మీ పిల్లలు కేసుల్లో ఉన్నారు అని వాళ్ళను భేదిరించి అకౌంట్ లో డబ్బులు ఎక్కువ మొత్తములో తీసుకొన్న ఘటనలు జరిగిన నేపథ్యములో అలాంటి ఘటనలు ఎక్కడైనా జరిగిన ఎక్కువ మొత్తములో డబ్బులు డ్రా చేయడానకి వచ్చిన పోలీస్ వారికి తెలపాలని వారిని అవేర్నెస్ కల్పించాలని తెలపడమైనది.

# పోలీస్ శిక్షణ కేంద్రంలో మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ ప్రాక్టీస్



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచట్లు:** ఏవైనా అవాంఛనీయ సంఘటనలు, హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్న సమయంలో అల్లరి మూకలను చెదరగొట్టడానికి మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ ముఖ్య ఉద్దేశమని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. శిక్షణలో భాగంగా పోలీస్ శిక్షణ కేంద్రంలో సివిల్, ఎఆర్ పోలీసులు, మాబ్ ఆపరేషన్-మాక్ డ్రిల్ ప్రాక్టీస్ బుధవారం నిర్వహించారు. విధ్వంసానికి పాల్పడుతున్న సందర్భాల్లో సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ, జన సమూహాలను నియంత్రించి శాంతిభద్రతలను ఎలా నియంత్రించాలన్న వాటిపై మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ ప్రాక్టీస్ ముఖ్య ఉద్దేశాన్ని సిబ్బందకి వివరించారు. తొలుత ఓ వైపు ప్లకార్డులు చేతపట్టిన ఆందోళనకారులు, అల్లరి మూకలు మరోవైపు వారిని ఎదుర్కొనేందుకు సిద్ధమైన పోలీసులు జన సమూహాలను కంట్రోల్ చేసేందుకు మొదటగా హెచ్చరికలు వినకపోతే ఉన్నతాధికారుల అనుమతితో భాష్పవాయువు ప్రయోగించడం, ఆ తర్వాత ఫైర్ డిపార్ట్మెంట్ వారితో వాటర్ కెనాన్ వారిపై ప్రయోగించడం, లాఠీ ఛార్జ్ చేపట్టడం, ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్ చేయడం అప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోతే ఫైరింగ్ చేయడం వంటివి డెమో ద్వారా ప్రదర్శించారు. మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ ముఖ్య ఉద్దేశం శాంతి భద్రతలకు విఘాతం కలిగినప్పుడు, ఘర్షణలు తలెత్తినప్పుడు శాంతిభద్రతలను పరిరక్షించడానికి పోలీస్ శాఖ ఎలా వ్యవహరిస్తుంది? ఘర్షణలకు పాల్పడిన వారిపై ఏవిధంగా చర్యలు తీసుకుంటారు? అనే దాని గురించి అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్ నిర్వహించినట్లు చెప్పారు.కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఆడ్మిన్ నరేష్ కుమార్, అడిషనల్ డీసీపీ లా%డ%ఆర్డర్ ప్రసాద్ రావు, ఏసీపీ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల అభివృద్ధి పెండింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

### - స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచట్లు:** జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మంజూరు చేసిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలనిస్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిపై అదనపు కలెక్టర్, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 955 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా అభివృద్ధి పనులు చేపట్టగా, 801 పాఠశాలల్లో పనులు పూర్తి అయ్యాయని, 147 పాఠశాలల్లో పనులు పురోగతిలో ఉన్నాయని, పెండింగ్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనులు పూర్తి చేయాలని అన్నారు. జిల్లాలో డి.ఎం.ఎఫ్.టి. క్రింద నిధులు అందుబాటులో ఉన్నాయని, పనుల పురోగతి ప్రకారం వెంట వెంటనే బిల్లుల చెల్లింపు పూర్తి చేస్తామని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి ఎంపిడిఓల దగ్గర నిధులు అందుబాటులో ఉన్నాయని అదనపు కలెక్టర్ తెలిపారు. మండల స్థాయిలో సమీక్షలు నిర్వహించి అభివృద్ధి పనులకు సంబంధించిన చెల్లింపులు జరిగేలా చూడాలని అన్నారు. గ్రామాలలో పాఠశాలల్లో మంజూరు చేసిన అభివృద్ధి పనులు, ఎన్ని పనులు పూర్తి చేశాము, చెల్లింపులు ఎన్ని జరిగాయి, మొదలగు అంశాలను ఎప్పటి కప్పుడు రివ్యూ చేసుకోవాలని అన్నారు. మన జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పనులు చేసేందుకు ముందస్తుగా అడ్వాన్స్ క్రింద 16 కోట్ల



18 లక్షలు మంజూరు చేశామని, వీటి చెల్లింపుల వివరాలను అదనపు కలెక్టర్ తెలుసుకున్నారు.జిల్లాలోని ఎంపిడిఓలకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టె పనుల కోసం 12 కోట్ల 28 లక్షలు విడుదల చేయగా ఇప్పటి వరకు 6 కోట్ల 49 లక్షల రూపాయలు చెల్లింపు చేయడం జరిగిందని, 4 కోట్ల 49 లక్షల వరకు ఎంపీడీవోలు వద్ద అందుబాటులో ఉన్నాయని,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల వద్ద 49 లక్షల నిధులు అందుబాటులో ఉన్నాయని అధికారులు వివరించారు. అనంతరం అదనపు కలెక్టర్ మండలాల వారీగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనుల పురోగతిపై సమీక్షించి, పనులు త్వరగా పూర్తి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి సోమశేఖర శర్మ, ముఖ్య ప్రణాళిక అధికారి ఏ. శ్రీనివాస్, విద్యాశాఖ ప్రాజెక్ట్ అధికారి రామకృష్ణ, అధికారులు, ఎంపిడిఓలు, ఎం.ఈ.ఓలు, ఇంజనీరింగ్ శాఖల ఈ.ఈ., డి.ఈ., ఏ.ఈలు, పాల్గొన్నారు.

# శాంతి భద్రతలకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

### - వనపర్తి టౌన్ ఎస్సై హరి ప్రసాద్




**వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు:** శాంతి భద్రతలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వనపర్తి టౌన్ నూతన సబ్ ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్ బి.హరిప్రసాద్ కోరారు .గోపాల్ పేట్ లో ఎస్సైగా విధులు నిర్వహించి, బదిలీపై వనపర్తి టౌన్ పోలీస్ స్టేషన్ కు వచ్చిన, ఎస్సై బి.హరిప్రసాద్ , మంగళవారం రోజు జిల్లా పోలీసు ప్రధాన కేంద్రంలో ఎస్పీ రావుల గిరిధర్ గారిని తన చాంబర్లో మర్యాదపూర్వకంగ కలిసి పూల మొక్క అందజేయడం జరిగింది. అలాగే వనపర్తి ఎమ్మెల్యే తూడి మేగారెడ్డి గారిని తిరుమల హిల్స్ లోని, మర్యాదపూర్వకంగా కలిసి, పూల మొక్కను అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ఐ బి.హరిప్రసాద్ మాట్లాడుతూ, కన్నీళ్లతో, పోలీస్ స్టేషన్ కు వచ్చే, ప్రజలకు పోలీసులు ప్రత్యక్షంగా కనిపించే దేవుళ్లు గా కనిపిస్తారని ఎస్ ఐ అన్నారు. న్యాయం కోసం పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు, ధైర్యం చెప్పి, వారి సమస్యకు సత్వరమే, న్యాయం అందించినప్పుడే పోలిస్ లపై నమ్మకం, విశ్వాసం కలగడమే కాక, గౌరవం పెరుగుతుందని సిబ్బందికి మార్గ నిర్దేశం చేశారు. ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడానికి చిత్తసుద్ధి తో, నిజాయితీ గా నిష్పక్ష పాతంగా కర్తవ్యలను నిర్వహించాలని ఎస్ ఐ సూచించారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదు దారుల తో స్నేహపూర్వకంగా, మర్యాదపూర్వకంగా ఉండాలని సిబ్బందికి సూచించడం జరిగింది. పి ఎస్ లో పెండింగ్ లో, ప్రధాన కేసుల దర్యాప్తు వాటి పురోగతి పై సమీక్షించారు. వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తే, రోడ్ ప్రమాదాలు నివారించవచ్చని ఎస్ఐ అన్నారు. అర్హత లేని వాహనాలపై ఉండే ప్రెస్, పోలీస్, ఇతర శాఖల పేర్లు తొలగించాలని, ప్రతి ఒక్క వాహనానికి సంబంధించిన సరైన ధ్రువపత్రాలు లేకుండా, వెళ్లి దారిలో కొందరు ఇష్టా రాజ్యాంగ డ్రైవ్ చేయడం సరి కాదన్నారు. వాహనాన్ని డ్రైవ్ చేస్తున్నప్పుడు పక్కవారికి ఇబ్బంది కలిగించే విధంగా చేస్తున్నారని, అలాంటి వాహనాలు తనిఖీ లో పట్టుబడితే కేసు నమోదు చేసి, వాహనం సీజ్ చేస్తామని ఎస్ఐ అన్నారు. వాహనాలకు నెంబర్ ప్లేట్లను రవాణాశాఖ సూచించిన విధంగానే ఉండాలని, తమకు ఇష్టం వచ్చిన రీతిలో నెంబర్ ప్లేట్లు రాసుకొని, కనబడకుండా మార్చుకుంటున్నారని ఇలా చేయడం చట్ట విరుద్ధమని హెచ్చరించారు. మీ చుట్టుపక్కల, మీ పరిసర ప్రాంతాల్లో, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అత్యవసర సమయంలో పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 100 కు సమాచారం ఇవ్వాలని, లేదా వనపర్తి పట్టణ ఎస్సై బి.హరిప్రసాద్ సెల్ నెంబర్: 87126 70612 కు, సమాచారం ఇవ్వాలని వనపర్తి టౌన్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బి.హరిప్రసాద్ అన్నారు.

# ఉద్యోగుల సమారాధనను విజయవంతం చేయండి

### - జె ఏ సి నాయకుల పిలువు...

### - ఉద్యోగులతో పాటు విలేఖరులూ ఆహ్వానితులే



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు** :నవంబర్ నెల 3వ తేదీన ఖమ్మం లో జరపతలపెట్టిన సకల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టి జి ఇ జె ఏ సి నాయకులు, ఆహ్వాన కమిటీ నాయకులు కోరారు. బుధవారం టి ఎన్ జి ఓస్ జిల్లా కార్యాలయం లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సకల ఉద్యోగుల సమారాధన వనసమారాధన కు సంబందించిన గోడపత్రిక, కరపత్రిలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సకల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం ప్రధాన్యత వివరించారు. సకల ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించే సకల ఉద్యోగుల సమ్మేళనంలో ప్రస్తుతం జరుగుతున్న కుల, మత వనబోజనాలకు అతీతంగా కుల, మత, ఉన్నత, కింద స్థాయి ఉద్యోగులనే తారతమ్యం లేకుండా ఐక్యంగా కలిసి మెలిసి జరుపుకుంటారని తెలిపారు. ఈకార్యక్రమాలతో పాటుగా రాష్ట్ర స్థాయిలో పేరున్న కళాకారులతో శాస్కృతిక కార్యక్రమాలు, వివిధ విభాగాల్లో పలురకాల క్రీడా పోటీలు మహిళలు, పురుషులకు విడివిడిగా నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్ర స్థాయిలో ఉమ్మడి జిల్లాల నుండి జె ఏ సి నాయకులు పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమానికి సుమారు కనీసం 15 వేల మంది హాజరావుతారని అంచనా వేస్తున్నామని అలాగే జె ఏ సి లో భాగస్వామ్యం కలిగిన రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో ఉన్న టి ఎన్ జి ఓ ఎస్, టీజీవస్ సంఘాల నాయకులతో పాటు వివిధ ఉపాధ్యాయ, సెర్ప్, కాంట్రాక్టు, రిటైర్డ్, ఉద్యోగ సంఘాల నాయకులు, భాద్యులు ఈ కార్యక్రమానికి హాజరావుతున్నారని వివరించారు. ఆఫీస్ సభార్డినేట్ నుండి గెజిటెడ్, ఉన్నతాధికారుల వరకు సమారాధనలో పాల్గొనేలా అవసరమైన ఏర్పాట్లు చేసామని పేర్కొన్నారు. ...

**ప్రతీఒక్కరికీ చేరేలా చర్యలు...**

జిల్లాలో ప్రతీ ఒక్కరికీ సమాచారం చేరేలా తగిన ఏర్పాట్లు చేసామని తెలిపారు. ఇందుకు గానూ ప్రతీ మండలం, గ్రామ స్థాయి వరకు గోడపత్రికలు, కరపత్రాలు చేరేలా చర్యలు తీసుకున్నట్టు వివరించారు.

**ఇంచార్జీల నియామకం...**

సమారాధన జరిగే ప్రదేశంలో ఎక్కడా లోపం జరగకుండా ఉండేలా అన్ని విభాగాలకు ఇంచార్జీలు నియమించిన్నట్టు చెప్పారు. అతిదుల స్వాగతం, పార్కింగ్, భోజనాలు, అతిధులకు వసతి, సంస్కృతిక విభాగం ఏర్పాట్లు, అతిదుల సన్మానం వంటి భోజనాల్లో శాఖహారం, నాన్ వెజ్, పూజ వంటి 20రకాల విభాగాలకు ప్రత్యేకంగా ఒక్కోదానికి నలుగురేసి ఇంచార్జీలను నియమించినట్టు అయన వివరించారు.

**దిగ్గజాల రాక...**

సకల ఉద్యోగుల ఆధ్వర్యంలో జరిగే వనసమారాధనకు వచ్చి ఉద్యోగ కుటుంబాలను ఆశీర్వదించేందుకు గాను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉమ్మడి జిల్లా కార్పొరేషన్ చైర్మన్ లు, హాజరావుతున్నారని వివరించారు. అలాగే జిల్లా ఉన్నతాధికారులైన కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్, కమీషనర్ ఆఫ్ పోలీస్ సునీల్ దత్, జిల్లా డివిజన్, మండల స్థాయి అధికారులు హాజరవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో జె ఏ సి నాయకులు టి ఎన్ జి ఓస్ నాయకులు కొణిదెన శ్రీనివాస్,టి జి ఓస్ నాయకులు కాస్తాల సత్యనారాయణ, రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు సునీల్ రెడ్డి, జమ్మి ఎస్ జయపాల్, గుంటుపల్లి శ్రీనివాస్, ఎం వేలాద్రి, ప్రముఖులు వైద్యులు డాక్టర్ బాబురత్నాకర్, జె ఏ సి రాష్ట్ర నాయకులు దేవరకొండ సైదులు , వై వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, కె కృష్ణారావు, విజయ్, వాసిరెడ్డి, శ్రీనివాసరావు, కోప్పిసెశెట్టి సురేష్, నాగమల్లేశ్వరరావు, పమ్మి వెంకటేశ్వరరావు, వీరాస్వామి, నాగేశ్వరావు, జి యాదగిరి, మల్లెల రవీంద్రబాబు, ఎం రాజేష్, కొమరగిరి దుర్గాప్రసాద్, చందాకాని రమణ యాదవ్ , ఆంజనేయులు, శ్రీధర్ సింగ్, బుసా చంద్రశేఖర్, గంగవరపు బాలకృష్ణ, వల్లపు వెంకన్న, ఎర్రా రమేష్, పి ఎం వీరన్న, బి అవినాష్, జె శ్రీను, సి హెచ్ కృష్ణ, కొప్పుల దిలీప్, రుక్మారావు, గుర్రం శ్రీనివాసరావు ఏలూరి కొనార్, తాళ్లూరి శ్రీకాంత్, సగ్గుర్తి ప్రకాష్, జంగం లక్ష్మణరావు, పెద్దినేని రాధాకృష్ణ, రవిచంద్ర, సత్యనారాయణ, బిక్కునాయక్, వెంకటేశ్వర్లు, వేణు, లలిత కుమారి, వీణా కుమారి, సుమమాలిని, ప్రమీల, వేణు, లలిత కుమారి, అంజమ్మ, మన్మధరావు, ముఖీద్, తదితరులు పాల్గొన్నారు...

# జమాతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఈనెల 29 న బహిరంగ సభ

ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:జమాతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం ఆధ్వర్యంలో " నైతికతే నిజమైన స్వేచ్ఛ " అంశంపై ఈనెల 29వ తారీకు మంగళవారం నాడు మధ్యాహ్నం రెండు గంటలకు ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రం నందు జరిగే బహిరంగ సభ కు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని ఖమ్మం మున్సిపల్ నగర మేయర్ పోనుకొల్లు నీరజ గారిని జమాఅతె ఇస్లామీ హింద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు అస్మా అన్జుమ్ ఇంద్రానగర్ శాఖ అధ్యక్షురాలు హుస్సేన్ బి, ఖిల్లా శాఖ క్యాంపెయిన్ కన్వీనర్ హాజీర సదఫ్ తో కూడిన మహిళా బృందం ఆహ్వానించారు. దానికి మేయర్ గారు తప్పనిసరిగా వస్తానని అన్నారు ఈ సందర్భంగా జమాతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం క్యాంపెయిన్ నెల రోజులు నిర్వహించిన కార్యక్రమాలను మేయర్ గారికి వివరించడం జరిగింది. ఈ సభకు అతిథులుగా జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర మహిళా నాయకులు అయినా ఇస్రత్ బాను ( స్టేట్ సెక్రటరీ జమాతే ఇస్లామీ హింద్ మహిళా విబాగం తెలంగాణా) బుష్రా రెహమాన్ ( స్టేట్ డైరెక్టర్ సి.ఐ.ఓ జమాతే ఇస్లామీ హింద్ మహిళా విబాగం తెలంగాణా) ,గజాల అర్షద్ ( స్టేట్ పి.అర్ సెక్రటరీ జమాతే ఇస్లామీ హింద్ తెలంగాణా) ఫాతిమా జోహారా (డిప్యూటీ మేయర్ ) పాల్గొని ప్రసంగిస్తారని అన్నారు ఈ బహిరంగ సభకు మహిళలు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక

# కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ డివిజన్ ,ఏర్పాటుకు కృషి చేస్తా

## -ఎంపీ కడియం కావ్య



కాజీపేట తెలంగాణ ముచ్చట్లు : హనుమకొండ జిల్లా కాజీపేట లో కోచ్ ఫ్యాక్టరీ, డివిజన్ ఏర్పాటుకు తన శాయశక్తుల కృషి చేస్తానని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. అయోధ్యపురంలో 160 ఎకరాలలో నిర్మాణం చేస్తున్న రైల్వే వ్యాగన్ తయారీ పరిశ్రమ నిర్మాణ పనులను లతోపాటు కాజీపేట రైల్వే స్టేషన్, రైల్వే ఆసుపత్రిని ఆమె బుధవారం పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి వైద్య సేవలు ఎలా అందుతున్నాయో అడిగి తెలుసుకోని ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్ని వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తో కలిసి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ ఉత్తర, దక్షిణ భారతదేశాన్ని కలిపే కాజీపేట రైల్వే జంక్షన్ పై రైళ్ల రద్దీ పెరుగుతోందని, రైళ్ల హాల్టింగ్, క్రాసింగ్ తో రాకపోకలకు అంతరాయం ఏర్పడటమే కాకుండా ప్రయాణికులు కూడా అవస్థలు పడాల్సి వస్తోందని, ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు మరికొన్ని ప్లాట్ ఫామ్ లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. రైల్వే స్టేషన్ లో నిర్మాణంలో ఉన్న ఆర్ఓబి తో పాటు వెయిటింగ్ హాల్లను మహిళలకు ప్రత్యేకంగా వెయిటింగ్ హాల్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించామని తెలిపారు. దివ్యాంగులకు సైతం ప్రత్యేకంగా, వెయిటింగ్ హాల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. 30 ఏళ్లుగా రైల్వే స్టేషన్ సమీపంలో బస్టాండు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, అంతేకాకుండా డీజిల్ కాలనీలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని త్వరలో జీఎంకి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం ప్లానింగ్ హెడ్ క్వాటర్ సికింద్రాబాద్ లక్ష్మీనారాయణ, సీనియర్ డిఎన్ఏ డీజిల్ కాలనీ వెంకట్, సిడిఎంఈ డీజిల్ అనికేత్, ఏడిఎన్ నార్త్ రామరాజు, ఎస్ ఎస్ సి వర్క్స్ సత్య రావు, ఇతర అధికారులు కార్పొరేటర్లు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో సబ్ డివిజన్స్, మ్యుటేషన్స్ వంటి భూసమస్యలపై వస్తున్న అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

మచిలీపట్నం, తెలంగాణ ముచ్చట్లు : గ్రామాల్లో సబ్ డివిజన్స్, మ్యుటేషన్స్ వంటి భూసమస్యలపై వస్తున్న అర్జీలను సకాలంలో పరిష్కరించి రెవిన్యూ వ్యవస్థ పనితీరు పట్ల ప్రజల్లో సానుకూలత కలిగించేలా కృషి చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ రెవిన్యూ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ బుధవారం కలెక్టరేట్లో రెవెన్యూ అధికారుల సమావేశం నిర్వహించి మీకోసం అర్జీలు, నీటి తీరువ పన్ను వసూళు ,, ఇసుక సరఫరా తదితర రెవిన్యూ అంశాలపై డివిజనులు, మండలాల వారిగా సమీక్షించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం అర్జీలపై కలెక్టర్ సమీక్షిస్తూ మీకోసంలో వస్తున్న అర్జీలలో రెవెన్యూ కు సంబంధించినవి ఎక్కువగా ఉంటున్నాయని, ముఖ్యంగా భూముల రీ సర్వే సమస్యలు, మ్యూటేషన్స్, సబ్ డివిజన్స్ వంటి భూసమస్యలు ఎక్కువగా ఉంటున్నాయన్నారు. రి సర్వే జరగని గ్రామాల్లో భూముల సబ్ డివిజన్స్ ఎక్కువగా ఉన్న గ్రామాలను గుర్తించి, వివాదాలు లేని సబ్ డివిజన్ సమస్యలను పరిష్కరిస్తే రాబోయే వివాదాలను నివారించవచ్చునని, ఈ దిశగా రెవెన్యూ అధికారులు కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, రెవిన్యూ మంత్రి కార్యాలయాల నుండి వచ్చే అర్జీలు నిర్ణీత గడువు లోగా పరిష్కరించాలన్నారు. రెవిన్యూ సేవలకు సంబంధించిన సమస్యలు, సర్వే సంబంధిత సమస్యలపై వచ్చే పిటిషన్స్ ఆయా సేవల విభాగానికి పంపాలని కలెక్టర్ సూచించారు. సరైన ఎండార్స్మెంట్ ఇస్తే రీఓపెన్కు అవకాశం ఉండదని, మరియు ఎండార్స్మెంట్ పిటిషనర్ కు తప్పనిసరిగా సర్వ్ చేయాల్సి ఉంటుందని, తాసిల్దార్లు ఇచ్చిన ఎండార్స్మెంట్లు సరిగా వున్నాయా లేదా ర్యాండంగా చెక్ చేయాలని ఆర్డీవోలకు సూచించారు.

తాసిల్దార్లకు గతంలో సూచించిన విధంగా గ్రామాల వారి గ్రీవెన్స్ ప్రొఫైల్ తయారు చేయకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రెవెన్యూ సదస్సుల తేదీ ప్రభుత్వం ఆకస్మికంగా ప్రకటించవచ్చని,ఇకనైనా ఆయా గ్రామాల్లో ఆయా ప్రాంతాలలో ఎక్కువగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి, ప్రొఫైల్ తయారు చేయాలని, ఇది రెవెన్యూ సదస్సుల నిర్వహణ సులభం చేస్తుందన్నారు. నీటి తీరువ పన్ను వసూల్లు మండల వారి కలెక్టర్ సమీక్షించారు. కోట్లాది రూపాయల పెండింగ్ వున్నందున, వీఆర్వోలతో మాట్లాడి వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. కొత్త అనధికార లేఔట్స్ ఒక్కటి కూడా రాకూడదని, ముఖ్యంగా రాష్ట్ర జాతీయ రహదారుల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా రక్షించాలన్నారు. ఇసుక రీచ్ లలో జెసిబి, ప్రోక్లైన్ లాంటి యంత్రాలతో తవ్వకాలు జరపరాదని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. అనధికార ఇసుక స్టాక్ యార్డ్ లు ఎక్కడా పెట్టకుండా తొలిదశలోనే నియంత్రించాలని, ఇదివరకే ఏమైనా ఉంటే వెంటనే తొలగించుటకు చర్యలు తీసుకోవాలన్నారు. ఫోటో ఓటర్ల జాబితాప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం షెడ్యూల్ ప్రకారం జరగాలన్నారు. జిల్లాలో ఎవరైనా అంగన్వాడిలు బిఎల్వోలుగా ఉంటే, వారి స్థానంలో గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులను నియమించాలని, బిఎల్వోలుగా నూరు శాతం గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కృష్ణ -గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానానికి జిల్లాలో పట్టభద్రులైన వారిని ఓటర్లుగా నమోదు చేసుకోవాలని, ముఖ్యంగా గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది అందరూ పట్టబద్రులు కావున, వీరిని తప్పనిసరిగా ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ మాట్లాడుతూ ప్రస్తుతం గడువు దాటినవి పెండెన్సీ జీరో అయిందని, అది అలాగే కొనసాగించాలని, , రీఓపెన్ తగ్గించాలని సూచించారు. మ్యుటేషన్స్ సరిగా చేయకపోవడంతో తాసిల్దార్లను తీవ్రంగా హెచ్చరించారు. ఇకపై ప్రతిరోజు టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షిస్తామన్నారు. డి ఆర్ వో కే చంద్రశేఖర రావు మాట్లాడుతూ జిల్లాలో మీకోసం లో వచ్చే అర్జీలలో పెండింగ్ సింహభాగం, గడువు దాటిన అర్జీలలో సింహభాగం రెవెన్యూ శాఖకు సంబంధించినవి కాబట్టి సీసీఎల్ఏ వీడియో కాన్ఫరెన్స్ లు నిర్వహించి సమీక్షిస్తున్నారని, కావున వీటిపై దృష్టి సారించాలన్నారు. పిజిఆర్ఎస్ నోడల్ అధికారి, కె ఆర్ ఆర్ సి ప్రత్యేక ఉప కలెక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కార్యాలయాల నుండి అందే పిటిషన్స్ జిల్లాకలెక్టర్ వారి ఎండార్స్మెంటుతో ముగించాల్సి ఉన్నందున, గడువు దాటే వరకు ఆగకుండా, మూడు రోజులు ముందుగానే కలెక్టర్వారికార్యాలయానికి పంపాలనిఅన్నారు సమావేశంలో గుడివాడ,ఉయ్యూరు,మచిలీపట్నం ఆర్డీవోలు బాలసుబ్రమణ్యం, షారోన్, కే. స్వాతి, కలెక్టరేట్ ఏవో, తాసిల్దార్లు పాల్గొన్నారు.

# అఖిల భారత యాదవ మహాసభ జిల్లా నాయకులు చంద్రకాంత్ గోవిందరావు మృతి తీరనిలోటు

## -డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్



ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు: ఖమ్మం జిల్లా అఖిల భారత యాదవ మహాసభ నాయకులు, రిటైర్డ్ విశ్రాంతి ఆర్టిఏ ఆఫీసర్ చంద్రకాని గోవిందరావు మృతి యాదవ సంఘాలకు తీరని లోటు అని, వారు యాదవ సంఘాలకు చేసిన సేవలు మరువలేని వని,గోవిందరావు మృతి పట్ల అఖిలభారత యాదవ మహాసభ జిల్లా గౌరవాధ్యక్షులు, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ 1990లోనాటి జిల్లా యాదవ పెద్దలు , కీ. శే. అమరబోయిన సైదయ్య, కనక బండి మోహనరావు మీగడ కన్నయ్య, లాంటి ప్రముఖులచే జిల్లాలోని గ్రామాలలో తిరిగి యాదవులను చైతన్యపరచి, యాదవ సంఘం అభివృద్ధి కొరకు, ఎంతో కృషి చేసిన వ్యక్తి అని కొనియాడారు.వారి స్ఫూర్తి, ప్రేరణతో నాలాంటి వ్యక్తులు ఎంతోమంది ఈనాటి వరకు సంఘం కొరకు పనిచేస్తున్నారనితెలిపారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎస్.కె ఫతే మహమ్మద్ మల్లె బోయిన శ్రీనివాస్, కనక బండి రమేష్, చంద్రకాని మధు, కనక బండి కనకరాజు,నూక చిన్న నాగయ్య, మరికంటి రమేష్ నాగేశ్వరరావుతదితరులు పాల్గొన్నారు

# వైసిపి నుంచి జనసేనలోకి పలువురు కార్యకర్తలు




కృష్ణాజిల్లా, తెలంగాణ ముచ్చట్లు : గుడివాడ రూరల్ మండలం కాశిపూడి,సిపూడి గ్రామ పంచాయతీల నుండి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి జనసేన పార్టీలోకి గుండె కోటేశ్వరరావు, రుద్రపాటి విజయ్,మాజీ గుడివాడ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చందనపల్లి సుందరరావు మరియు గ్రామ నాయకులు కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు.ఈ కార్యక్రమంలో గుడివాడ నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ రూరల్ మండల అధ్యక్షుడు ఇంటూరి గజేంద్ర,ఉపాధ్యక్షుడు బట్టు రవికిరణ్,మట్ట విజయ్ కాటూరి చంటి, జాబి ఖాన్,పట్టణ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.ఉప ముఖ్యమంత్రి పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ మంత్రివర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ ఆశయాలు ఆలోచనా విధానం నచ్చి వైసీపీని వీడి జనసేన పార్టీలో చేరారు.రానున్న రోజుల్లో గుడివాడ మండలంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేస్తామని,పవన్ కళ్యాణ్ లాంటి వ్యక్తి నాయకత్వంలో పనిచేయడం తమకు గర్వకారణమనారు.

# అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కృత్తివెన్ను, తెలంగాణ ముచ్చట్లు : కృత్తివెన్ను మండలంలోని చిన్న గొల్లపాలెం గ్రామానికి చెందిన సుందర సత్యనారాయణ వయసు 42 సంవత్సరాలు, మంగళవారం నాడు ఇంటి దగ్గర నుంచి పనికొరకు వెళ్లి తిరిగి రాలేదు. బుధవారం నాడు చిన్నగొల్లపాలెం సముద్ర ఒడ్డున గల సరుకు తోటలో చనిపోయి పడి ఉన్నారు. కృత్తివెన్ను పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య



జగ్గయ్యపేట టౌన్, అక్టోబర్ 23తెలంగాణ ముచ్చట్లు : రాష్ట్రంలోని గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య తెలిపారు. పట్టణంలోని తాతయ్య నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 4 మండలాలకు రూ. 17 కోట్ల రూపాయలు నిధులు ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైనట్లు తెలిపారు. నాలుగు మండలాల్లో 40 కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు, 10 కిలోమీటర్లు డ్రైన్ ల నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జనవరి కల్లా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా ఈనెల 26 నుంచి తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు ముఖ్యంగా సహజ మరణానికి కూడా 5 లక్షలు వర్తించే విధంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సభ్యత్వం నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కృష్ణ గుంటూరు జిల్లాల పట్టబద్రులు ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ ను ఎన్డీఏ కూటమి ప్రకటించినట్లు తెలిపారు. కావున గ్రాడ్యుయేట్ లందరూ తమ ఓటును నమోదు చేసుకొని ఆయన గెలుపు కృషి చేయాలని పిలుపునిచ్చారు. త్వరలోనే నీటి సంఘాల ఎలక్షన్లు జరగబోతున్నట్లు తెలిపారు. త్వరలోనే సొసైటీ ఎలక్షన్ కూడా ఉన్నట్లు చెప్పారు. 2014 నుంచి 2019 వరకు అప్పటి తె.దే.పా గవర్నమెంట్ లో గ్రామాల అభివృద్ధి పూర్తి స్థాయిలో జరిగినట్లు తెలిపారు. అనంతరం వచ్చిన వైకాపా ప్రభుత్వంలో పూర్తిగా నిర్లక్ష్యం వహించినట్లు తెలిపారు. కావున మరల ఎన్డీఏ కూటమిలో అభివృద్ధి బాటల పెద్ద పీట వేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కట్టా వెంకట నరసింహారావు, వడ్లమూడి రాంబాబు, యానాల గోపీచంద్, కానూరి కిషోర్, పొట్టపొంగు బాబురావు, చిట్టూరి సుభాష్, నటుకుల బాబురావు మరియు కూటమీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రిజర్వాయర్ నుంచి వచ్చే నీరు కలుషిత నీరు తాగునీటికి పనికి రాదు




కందుకూరు, అక్టోబర్ 23 తెలంగాణ ముచ్చట్లు : కందుకూరు అభివృద్ధి మండలి సభ్యులు కందుకూరు నియోజకవర్గం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గారిని కలిసి రాళ్లపాడు రిజర్వాయర్ నుంచి 100 గ్రామాలు కి అందిస్తున్న మంచినీటి తాలూకా లాబ్ నివేదికని అందజేయడం జరిగినది. ల్యాబ్ నివేదికలో రిజర్వాయర్ నుంచి వచ్చే నీరు కలుషితమైన నీరు అని తాగునీటికి పనికిరాదు అని వచ్చిన సంగతి అందరికీ తెలిసినదే దీని మీద తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఎమ్మెల్యే గారిని కోరడం జరిగింది. దివి శివరాం గారు మాట్లాడుతూ ఇక్కడ రాజకీయాలకు తావు లేకుండా ప్రస్తుత కలుషిత నీటి సమస్యను పరిష్కరించవలసిందిగా కోరడం జరిగింది అలాగే చెరువులో చేపల పెంపకం సంబంధించిన వ్యర్థాలను వేయకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరడం జరిగింది. ఇంటూరి నాగేశ్వరావు గారు మాట్లాడుతూ ప్రస్తుత కలుషిత నీరుకి కారణం నీటిని శుద్ధి చేసే పరికరాలు మార్చి 8 సంవత్సరాలు అయింది అలాగే గత ప్రభుత్వం పరికరాలు మార్చడం కోసం బిల్లులు కూడా పెట్టడం జరిగింది అని వివరణ ఇవ్వడం జరిగింది అలాగే చెరువులో వ్యర్థాలు వేస్తున్నారు అన్న ప్రచారం మంచిది కాదు అని ఒకవేళ అదే జరిగితే ముందుగా స్పందించేది నేనే అని చెప్పడం జరిగింది. నేతి మహేశ్వర రావు మాట్లాడుతూ అభివృద్ధి మండలి లక్ష్యం కందుకూరి అభివృద్ధి కాబట్టి అభివృద్ధి మండలిని అభివృద్ధి కోణంలో ఆలోచించి అభివృద్ధి మండలి అంశాలను మీకు వచ్చే ఇంటిలిజెంట్స్ ఇచ్చిన రిపోర్టుగా భావించి పరిష్కరిస్తే ప్రభుత్వానికి ప్రజలకు మేలు జరుగుతుంది అని చెప్పడం జరిగింది. పాలేటి కోటేశ్వరరావు గారు మాట్లాడుతూ అభివృద్ధి మండలి లక్ష్యం కందుకూరి అభివృద్ధి తప్ప రాజకీయాలు కాదు అని ఒకవేళ టీడీపీ పార్టీలో అంతర్గత విబేధాభిప్రాయాలు ఉంటే మీరు కూర్చొని సర్దిద్దుకుంటే బాగుంటుంది అని అభివృద్ధి మండలి భావిస్తుంది.

# రీ సర్వే లో భూ సమస్యలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలి.... డి టీ, మహేష్

### - కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం
### - గ్రామాల అభివృద్ధి కోసం గ్రామ సభలు... బండే గురుస్వామి
### - పూలచింత గ్రామ సభకు 150 అర్జీలు ఇచ్చిన రైతులు





నందవరం మండలం,తెలంగాణ ముచ్చట్లు : నందవరం మండల పరిధిలోని పూలచింత లో రీ సర్వే గ్రామ సభ నిర్వహించడం జరిగింది. డిటీ తహసీల్దార్ మహేష్ ఆయన మాట్లాడుతూ పూలచింత గ్రామంలో రీసర్వ్ కి సంబంధించింది మొత్తం 150 అర్జీలు వచ్చాయని డిప్యూటీ తాసిల్దార్ మహేష్ తెలియజేశారు. ఈ సందర్బంగ గ్రామాల్లో సమస్యలు ఆన్లైన్ ద్వారాఆర్ ఓ ఆర్, అడంగల్, ఏదైనా ఎల్పీ నెంబర్ ప్రకారంగా నిర్వహిస్తున్నామని, రీ సర్వేలో సమస్యలున్న రైతులు అర్జీలు పెట్టుకుంటే వాటిని గ్రామ సభ ద్వారా సమస్యలు పరిష్కరిస్తారని తెలియజేశారు. రైతులు రి సర్వేలో భూ సమస్యలు ఉంటే గ్రామ సభలను దరఖాస్తు పెట్టుకోవాలనీ కోరారు. అదేవిధంగా బండే గురుస్వామి మాట్లాడుతూ పూల చింత గ్రామంలో స్మశానం కోసం 16 సర్వే నెంబర్లు ఒక్క ఎకరా స్మశానానికి కేటాయించామని, ఎస్సీ కాలనీలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు విగ్రహం కోసం స్థలం కేటాయించామని అధికారుల సమక్షంలో ఆ గ్రామ ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ యువ నాయకులుబండే గురుస్వామి, ఆర్ ఐ, ఇర్మియ మండల సర్వే అక్బర్ బాషా, ఇంచార్జ్ విఆర్ఓ రాఘవేంద్ర, వ్యవసాయ రైతులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు మండలం లోనివడ్లరామాపురం,కృష్ణాపురం గ్రామం నందు పొలం పిలుస్తుంది కార్యక్రమం






ఆత్మకూరు, తెలంగాణ ముచ్చట్లు : నంద్యాల జిల్లా. శ్రీశైలం నియోజకవర్గం. ఆత్మకూరు మండల గ్రామాల నందు పొలం పిలుస్తుంది కార్యక్రమము నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ మినుము పంట లో విత్తన శుద్ధి ,ఆశించే పరుగులు మరియూ తెగుళ్ల గురించి తెలియచేస్తూ మినుము పంట సాగుచేసే రైతులకు మినుము %ఎదీచీ%-8 రకము చిరు నంచులు (%ఎఅఋనెట్ం% )100% రాయితీ పై ప్రభుత్వము అమలు చేస్తున్న విషయాన్ని తెలియచేస్తూ రైతులకు పంపిణీ చేయటం జరిగింది. మరియూ పప్పు శనగ 25% రాయితీ పై 50 %నత్శ్రీం% మంజూరు చేయటం జరిగింది. కావాల్సిన రైతులు పొడవలసిందిగా కోరడమైనది.

# చెంచు గిరిజన మహిళా ఈదమ్మ డెలివరీపై నిజ నిర్ధారణ కమిటీ వేసిసమగ్ర విచారణ జరిపించాలి



ఆత్మకూరు, తెలంగాణ ముచ్చట్లు : గత నెల 21వ తేదీన కొత్తపల్లి మండల కేంద్రంలోని,ప్రభుత్వ ఆసుపత్రి మెట్ల వద్ద 8వ కాన్పు డెలివరీ ఐన చెంచు గిరిజన మహిళ ఈదమ్మకు రెండు చీరలు బహూకరించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న గిరిజన సంక్షేమ సంఘం నాయకులు జవహర్ నాయక్.చెంచు గిరిజన మహిళ ఈదమ్మ డెలివరీ పై నిజ నిర్ధారణ కమిటీ వేయాలి. పురిటి నొప్పులతో డెలివరీ కోసం కొత్తపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళిన చెంచు గిరిజన మహిళ ఈదమ్మ 6 వ కాన్పునందికొట్కూరు దాటిన తర్వాత అంబులెన్స్ లో డెలివరీ కావటం జరిగింది. 7వ కాన్పు కొత్తపల్లి ప్రభుత్వ ఆసుపత్రి మెట్ల వద్ద డెలివరీ కావటం జరిగింది. 8వ కాన్పు కొత్తపల్లి ప్రభుత్వ ఆసుపత్రి మెట్ల వద్ద డెలివరీ కావటం జరిగింది.

# రీ సర్వే పనులను నవంబర్ 30 లోపల పూర్తి చేయండి

### -సియంఓ ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ చూపండి
### -ఫ్రీ హెూల్డ్ భూముల ప్రక్రియపై జాగ్రత్తలు తీసుకోండి
### -రెవెన్యూ అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




నంద్యాలజిల్లా. అక్టోబర్ 23:- తెలంగాణ ముచ్చట్లు : రీ సర్వేపై వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నవంబర్ 30 లోపల పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి రెవెన్యూ అధికారులు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో రెవెన్యూ అంశాలపై రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, డిఆర్ఓ ఎ.పద్మజ, ఆర్డీఓలు మల్లికార్జున్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, ఎం. దాసు అన్ని మండలాల తాసిల్దారులు, తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ 211 గ్రామాలలో రీ సర్వే పూర్తయిందని... రీ సర్వేలో భూ సమస్యలకు సంబంధించి వచ్చినహా ఫిర్యాదులను ప్రాధాన్యతగా తీసుకొని నవంబర్ 30 లోపల పూర్తి చేయాలని మండల తహసీల్దార్లు ను ఆదేశించారు. రోవర్ తో, భౌతికంగా కొలతలు వేసినా ఒకే విస్తీర్ణం వస్తుందన్న విషయాన్ని రైతులకు వివరించడంతో పాటు విస్తీర్ణంలో సాగు చేసి ఉంటే సంబంధిత పంటలపై కూడా రీసర్వే చేయించాలని తాసిల్దార్లను ఆదేశించారు. జిల్లాలో ఏడు జాతీయ రహదారుల నిర్మాణ పనులు జరుగుతున్నాయని వీటికి సంబంధించి భూ సేకరణ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 544డి, 340సి, 440, 167కె రహదారులకు సంబంధించి రోడ్ల విస్తరణకు అదనపు భూములకు భూ సేకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. 340సీకి సంబంధించిన 1.98 కిలోమీటర్ల పరిధిలో ని 650 మీటర్ల పొడవుగల రోడ్డుకు సంబంధించిన ప్రతిపాదనలు ఎన్ హెచ్ పిడికి పంపినట్లయితే సంబంధిత పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు.సిఎంఓ కార్యాలయం నుండి వచ్చిన ఫిర్యాదులను ప్రాధాన్యతగా తీసుకొని పెండింగ్ లో వున్న 9 సమస్యలను పరిష్కరించలాన్నారు. సీఎంఓ ఫిర్యాదులు రీఓపెన్ అయితే సంబంధిత కారణాలను వివరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులలో రెవెన్యూ శాఖకు సంబంధించి 630 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని బియాండ్ ఏస్ఎల్ఏ లోగా పరిష్కరించాలని మండల తాసిల్దారును ఆదేశించారు. ఎస్ఎల్ఏ సమయం ముగిసే సమయానికి పరిష్కరించడం వల్ల నాణ్యతగా ఉ ఒడడం లేదన్నారు. ఫిర్యాదుదారులకు అర్థమయ్యే రీతిలో తెలుగులో అర్థవంతంగా వ్రాసి ఎండార్స్ ఇవ్వాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారానికి అంకితభావంతో ఒకరోజు కేటాయించుకొని సంబంధిత ఫిర్యాదులను క్లియర్ చేయాలన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ నుండి ఆర్థిక సహాయ నిమిత్తం వున్న దరఖాస్తులను వెంటనే కలెక్టరేట్ పంపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య సంబంధిత సమస్యలకు సంబంధించి ఎన్టీఆర్ వైద్య సేవ కింద 25 లక్షల రూపాయల వరకు ప్రభుత్వం సమకూరుస్తుందని ఇందుకు సంబంధించిన దరఖాస్తులను కూడా వెంటనే పంపాలన్నారు. ప్రమాదవశాత్తు జరిగిన సంఘటనలపై డిఆర్డిఏ తో చంద్రన్న బీమా వర్తించని అర్హత పొందిన దరఖాస్తులను మాత్రమే కలెక్టరేట్ కు పంపాలన్నారు.

జిల్లాలో 14,280 ఎకరాలకు సంబంధించిన ఫ్రీ హెూల్డ్ భూములకు సంబంధించి స్వయం సంతకాల ప్రతులను అందజేయాలన్నారు. డీవియేషన్ చేసిన భూముల వివరాలను కేటగిరీల వారీగా పంపాలన్నారు. ప్రభుత్వానికి నివేదించిన 65,380 ఎకరాలో 14,214 ఎకరాలు డివియేషన్ చేసినట్లు పేర్కొన్నారని ఇందుకు సంబంధించి గ్రామ, మండల , సర్వే నంబర్ల వారీగా నివేదికలు ఇవ్వాలన్నారు. ఇందులో 1652 ఎకరాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తయినట్లు తెలిపారు. జిల్లాలో నిబంధనలు పాటించకుండా ఫ్రీ హెూల్డ్ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరిగిందని ఇందుకు ప్రభుత్వం తీసుకునే చర్యలకు కూడా సంసిద్ధంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. 264 ఎకరాలు సర్వీస్ ఇనాం భూములకు కూడ డీవియేషన్ నివేదికలు ఇచ్చారని అందుకు గల కారణాలను వివరించాలన్నారు. ఆర్ఓఆర్ కేసులకు సంబంధించి ఎండార్స్ ఇవ్వకుండా స్పీకింగ్ ఆర్డర్స్ ఇవ్వాలని కలెక్టర్ పేర్కొన్నారు.జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ మాట్లాడుతూ రీ సర్వే పనులు పూర్తి చేయడంతో పాటు కోర్టు కేసులకు సంబంధించి జారీ చేసిన ఉత్తర్వులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. 25 కంటెంప్ట్ కేసులు, 14 లోకాయుక్త కేసులు ఉన్నాయని వెంటనే క్లియర్ చేయాలని జేసీ ఆదేశించారు. 261 సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా వచ్చేనెల 6వ తేదీ లోపు పూర్తి చేయాలన్నారు. స్మశాన వాటికలకు సంబంధించి స్థలాలను గుర్తించి సంబంధిత నివేదికలను అందజేయాలని సూచించారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ ప్రతినిధులచే బ్లడ్ బ్యాంక్ సెంటర్ లో సర్వమత ప్రార్థనలు



నరసరావుపేట, తెలంగాణ ముచ్చట్లు :పల్నాడు జిల్లా నరసరావు పేట స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో నూతనంగా నిర్మించిన రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ లో బుధవారం సర్వమత ప్రార్థనలు నిర్వహించిన ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్ కంజుల జగన్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ శరత్ బాబు, కోశాధికారి గంద్రకోట మురళీకృష్ణ, మేనేజింగ్ కమిటీ మెంబర్స్ డాక్టర్ సృజన, డాక్టర్ రహమతుల్లా, రెడ్ క్రాస్ సభ్యులు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ షేక్ మస్తాన్ వలి, జెల్లీ వీరారెడ్డి, జీవీఎస్ రాము, యస్.కె. జిలానీ మాలిక్, బ్లడ్ సెంటర్ వైద్య అధికారులు డాక్టర్ మురళీధర్, డి సి హెచ్ యస్ డాక్టర్ రంగారావు, ఆర్.ఎం.ఓ. ఏడుకొండలు, రెడ్ క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 2024 నవంబర్ 10వ తేదీన పల్నాడు జిల్లా నరసరావుపేటలోని నూతనంగా నిర్మించిన ప్రభుత్వ వైద్యశాలలో నూతనంగా నిర్మించిన బ్లడ్ బ్యాంక్ సెంటర్ ప్రారంభించడానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తదితర ప్రజాప్రతినిధులు పట్టణ ప్రముఖులు ద్వారా ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. ఈ బ్లడ్ బ్యాంక్ సెంటర్ ద్వారా పల్నాడు జిల్లాలో ఉన్న ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవచ్చని తెలియజేశారు.

# కడప - రాయచోటి - మదనపల్లి - బెంగుళూరు నూతన బ్రాడ్ గేజ్ రైల్వే నిర్మాణానికి మంగళం పలికినట్లేనా?

### -డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి,రాజ్య సభ మాజీ సభ్యులు, ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి


వేంపల్లి, తెలంగాణ ముచ్చట్లు : కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి చూస్తుంటే కడప - రాయచోటి - మదన పల్లి - బెంగుళూరు నూతన బ్రాడ్ గేజ్ రైలు మార్గంనిర్మాణానికి మంగళం పలికినట్లు కనిపిస్తోంది. ఇది చాలా విచారకరం.రాయలసీమ సమగ్రాభివృద్ధి కోసం 2008 - 09 రైల్వే బడ్జెట్ లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం ఖర్చు భరించే షరతుతో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును మంజూరు చేసింది. దీని పొడవు 255.40 కిలోమీటర్లు.ఇందులో 205 కిలోమీటర్లు ఆంధ్ర ప్రదేశ్ లో,50.40 కిలోమీటర్లు కర్నాటకలో. 2008- 09నాటి అంచనా వ్యయం రు3038 కోట్లు. 2010 సెప్టెంబర్ లో నాటి రైల్వే మంత్రి మునియప్ప గారు శంకుస్థాపన చేసారు. ఇందులో 4 దశలు.మొదటి దశ కడప నుండి పెండ్లిమర్రి వరకు,రెండవ దశ పెండ్లిమర్రి నుండి మదనపల్లి వరకు,మూడవ దశ మదనపల్లి నుండి ముల్బాగల్ వరకు,నాల్గవ దశ ముల్బాగల్ నుండి కోలార్ వరకు. మొదటి దశ పని కడప నుంచి పెండ్లిమర్రి వరకు 21.80 కిలోమీటర్లు పూర్తి అయింది.రు 351 కోట్లు ఖర్చు అయింది. రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రు 132.39 కోట్లు విడుదల అయింది.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU

# పోలీసుల సేవకు అభినందనీయం

## - ఆదరాభిమానాలు పొందిన పోలీస్ సిబ్బంది





నందవరం మండలం, తెలంగాణ ముచ్చట్లు : నందవరం మండల స్థానిక పోలీస్ స్టేషన్ నందు మంగళవారం రోజు న పనిచేస్తున్న 06 మంది పోలీస్ లు ఏ ఎస్ ఐ %అ%ఆనంద్, హెడ్ కానిస్టేబులు పరమేష్, ఆంజనేయులు కానిస్టేబుళ్లు - మల్లికార్జున, నాగరాజు ట్రాన్స్ఫర్ కావడం జరిగింది. ఈ సందర్భంగా %ఙూ% మరియు సబ్ ఇనస్పెక్టర్ సమక్షంలో వారికి కేకు కట్ చేసి శాలువాలతో సన్మానం చేసారు. ఈ కార్యక్రమానికి మండల టిడిపి నాయకులు దేశాయ్ నెట్వర్క్ అదినేత గురురాజ్ దేశాయ్ హాజరయ్యారు. గురురాజ్ దేశాయ్ మాట్లాడుతూ ఈ ఆరుమంది పోలీస్ లు విధినిర్వహణలో బాధ్యతగా పనిచేస్తూ నందవరం మండల ప్రజల లో ఆదరాభిమానాలు పొందారని అన్నారు. అలాగే ప్రజలతో స్నేహపూర్వకంగా ఉంటూ మండలంలో క్రైమ్ రేట్ తగ్గించడానికి చాలా కృషిచేశారన్నారు. ఇలాంటి పోలీస్ లు మళ్ళీ మా మండలానికి రావాలని ప్రజలు మనస్ఫూర్తిగా కోరుకొంటున్నారు. ఈ కార్యక్రమంలో దేశాయ్ యూత్ అధ్యక్షులు సాదిక్, తోట పాండు, కె శివ, %ఎ% కాలనీ స్కూలు చైర్మన్ పి శివ, జెసిపి రాజు, అజయ్, దండు వీరేశ్, అబ్దుల్, సజీవ, ఇస్రాయిల్ మరియు దేశాయ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి

## - తర్లుపాడు ఎస్సై బ్రహ్మనాయుడు



తెలంగాణ ముచ్చట్లు :ప్రకాశం జిల్లా తర్లుపాడు ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు కొందరు కేటుగాళ్లు ఆన్లైన్ మోసాలకు పాల్పడుతూ సైబర్ నేరాలు చేస్తున్నారని తర్లుపాడు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై బ్రహ్మనాయుడు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హ్యూమన్ రైట్స్ కమిషన్ పేరుతో కొన్ని అనుబంధ సంస్థల అధికారులమని కాల్స్ చేసే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా వ్యవహరిస్తే సైబర్ నేరాలకు గురికాకుండా ఉండవచ్చని అన్నారు. కొందరు కేటుగాళ్లు ఫేక్ వెబ్సైట్లు ఐడి కార్డులు, సోషల్ మీడియా గ్రూపులు సృష్టించి వ్యక్తుల యొక్క పర్సనల్ డేటాను వారి బ్యాంకు వివరాలను సేకరించి మేము ఫలానా సంస్థల అధికారులమని ఫోన్ చేసి మీరు పలానా తప్పు చేశారని కేసు నమోదు చేస్తామని బెదిరింపులకు గురిచేసి డబ్బులు ట్రాన్స్ఫర్ చేయాలని డిమాండ్ చేస్తారు ఇలాంటి కేటుగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లయితే వారి భారినుండి రక్షణ పొందచ్చని, అన్నారు .ముందుగా మనకు వచ్చిన సమాచారం నిజమైనదా కాదా అని నిర్ధారించుకొన్న తర్వాత అది ఫేక్ అని తెలిస్తే తర్లుపాడు పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని కోరారు. మండల పరిధిలో అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి వారి సమాచారాన్ని పోలీస్ శాఖకు ఇవ్వాలని తెలిపారు సమాజంలో తిరిగే మోసపూరితమైన వ్యక్తులను గుర్తించి వారు చేసే మోసాలు కుట్రలను ఎదిరించే బాధ్యత ప్రజలందరిపై ఉందని, ఇలాంటి సైబర్ నేరాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి పౌరులపై ఉందని సూచించారు.

# సీజన్లో వ్యాధులపై జాగ్రత్తలు పాటించండి :ఎంపీడీవో ఎం శ్రీదేవి





దొనకొండ తెలంగాణ ముచ్చట్లు : దొనకొండ మండలంలో బుధవారం మండల అభివృద్ధి కార్యాలయం నందు సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు సరైన అవగాహన కలిపించి మలేరియా డెంగ్యూ లాంటి విషజ్వరాలు లేని మండలంగా దొనకొండ ను చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మండల అభివృద్ధి అధికారి ఎం శ్రీదేవి తెలిపారు. దొనకొండ మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ తమీం అన్సారియా ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. మండల అభివృద్ధి అధికారి ఎం శ్రీదేవి ,ఆధ్వర్యంలో దొనకొండ వైద్యశాల వైద్యులు డాక్టర్ కే సునీత, మండల విస్తరణ అధికారి షేక్ షఫీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలకు, ఆశ వర్కర్లకు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ లకు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి ఎం శ్రీదేవి, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ కే సునీత, మండల విద్యాశాఖ అధికారి ఎం సాంబశివరావు, ఈఓఆర్డి షేక్ షఫీ , రెవెన్యూ శాఖ సూపర్డెంట్ బాజీ ఐసిడిఎస్ సూపర్వైజర్ సుభాషిని మాట్లాడుతూ... సీజనల్ వ్యాధుల పట్ల వాళ్ళ అంశములను తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు అనంతరం ఏఎన్ఎంలు ఆశ వర్కర్ల ద్వారా ప్రతిరోజు ప్రజలకు అవగాహన కలిగిస్తున్నామని ప్రజలు కూడా జ్వరం వచ్చిన వెంటనే ప్రైవేట్ వైద్యశాలలకు పరిగెత్తి వేలు వేలు ఖర్చు చేయకుండా ప్రభుత్వ వైద్యశాలకు వస్తే మలేరియా డెంగ్యూ పరీక్షలు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యం అందించడం జరుగుతుందన్నారు ఈ సందర్భంగా పలువురు మండల కార్యదర్శులు మాట్లాడుతూ మలేరియా దోమలు మురికి నీళ్లల్లో వృద్ధి చెంది రాత్రుల కరుస్తాయని, అదే డెంగ్యూ దోమ మంచినీటిలో పెరిగి పగలు కరుస్తుందన్నారు అందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ శాఖ సిబ్బంది, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# అమరవీరుల సంస్కరణ దినోత్సవం సందర్భంగా మెగా రక్తదా శిబిరం: సీఐ సురేష్




తెలంగాణ ముచ్చట్లు : ప్రకాశం జిల్లా గిద్దలూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో అక్టోబర్ 25వ తేదిన శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి నిర్వహించు మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని యువకులను గిద్దలూరు అర్బన్ సిఐ సురేష్ విజ్ఞప్తి చేశారు. పోలీసుల అమరవీరుల సంస్కరణ దినోత్సవం పురస్కరించుకొని ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అత్యవసర సమయంలో రక్తం అవసరమై ఇబ్బందులు పడే వారిని దృష్టిలో ఉంచుకొని యువకులు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సీఐ సురేష్ యువతకు సూచించారు. రక్తదానం చేయాలనుకునే వారు గిద్దలూరు పోలీస్ స్టేషన్ లో మీ పేరు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

# వైసిపి మానస పుత్రిక ఫీజు రీయింబర్స్మెంట్ పథకం



పులివెందుల, తెలంగాణ ముచ్చట్లు : మూలంరెడ్డి ధృవకుమార్ రెడ్డి పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి మూలంరెడ్డి ధృవకుమార్ రెడ్డి మాట్లాడుతుమహానేత హయాంలో, కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన ఒక ప్రతిష్ఠాత్మక పథకం. పేద బిడ్డల జీవితాల్లో వెలుగులు నింపి, ఎంతో మంది ఇంజనీర్లను, డాక్టర్లను తయారు చేసిన గొప్ప పథకం. నాడు ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని %ూ=% అద్భుతంగా అమలు చేస్తే.. సొంత కొడుకై ఉండి జగన్ మోహన్ రెడ్డి గారు తన హయాంలో పథకాన్ని నీరు గార్చారు. విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజులు రూ.3500 కోట్లు పెండింగ్ పెట్టడం నిజంగా సిగ్గుచేటు. బకాయిలు చెల్లించకుండా వారి జీవితాలతో చెలగాటం ఆడారు. తల్లిదండ్రులను మనోవేదనకు గురి చేశారు. దోచుకొని దాచుకోవడం మీద ఉన్న శ్రద్ధ, విద్యార్థుల సంక్షేమం మీద పెట్టలేదు. %ూ=% తన జీవితం మొత్తం మత పిచ్చి బీజేపీనీ వ్యతిరేకిస్తే..అదే బీజేపీకి జగన్ గారు దత్తపుత్రుడు. బీజేపీతో చెట్టా పట్టాలు వేసుకొని తిరిగిన మోడీ వారసుడు జగన్ గారు. అలాంటి వాళ్లకు వైసిపి ఆశయాలు గుర్తుకు ఉంటాయని అనుకోవడం, ఆశయాలకు వారసులు అవుతారనడం పొరపాటు. నాడు %ఙూ% ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని నీరుగార్చి నిర్వీర్యం చేయాలని చూస్తే.. నేడు కూటమి ప్రభుత్వంనిర్లక్ష్యం చేస్తోంది. వైసీపీ చేసింది మహా పాపమైతే.. కూటమి సర్కారు విద్యార్థులకు పెడుతున్నది శాపం. ఫీజు రీయింబర్స్మెంట్ విషయంలో నారా చంద్ర బాబు నాయుడు గారిని డిమాండ్ చేస్తున్నాం. బకాయిలు ఎవరు పెండింగ్ పెట్టినా.. అవి రిలీజ్ చేసే బాధ్యత ఇప్పుడు మీపై ఉంది. వెంటనే నిధులు విడుదల చేయాలని, పథకానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం.

# అర్ధరాత్రి అక్రమరేషన్ పై పంజా విసిరిన సబ్ కలెక్టర్

## - 3 టన్నుల పై బియ్యం తో వెళ్తున్న లోడుపై మెరుపు దాడి చేసిన మార్కాపురం సబ్ కలెక్టర్


## - అక్రమ రేషన్ బియ్యం పై ఉక్కు పాదం



ప్రకాశం, తెలంగాణ ముచ్చట్లు : అర్ధరాత్రి అనగా 23-10-2024 00:30 సమయం లో మాటేసి మరి మూడు టన్నుల పైగా అక్రమముగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ప్రకాశం జిల్లా మార్కాపురం సబ్ కలెక్టర్ పట్టుకున్నారు. పక్కా గా వచ్చిన సమాచారం మేరకు ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం నియోజకవర్గం పరిది లోని కుంట వద్ద నుండి తమిళనాడు రాష్ట్ర బంగారుపేట కు అక్రమముగా తరలిస్తున్న మూడు టన్నుల పై చిలుకు రేషన్ బియ్యాన్నీ మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట నాగ త్రినాధ్ తో పాటు బెస్తవారీపేట యం ఆర్ ఓ జితేంద్ర తో కలిసి చాక చక్యంతో దాడులు చేసి పట్టుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనాన్ని అక్రమ బియ్యం రవాణా చేస్తే ఉపేక్షించేది లేదని అన్నారు. ఈ దాడీ లో కంభం మండలం వీఆర్వో సంఘం అధ్యక్షుడు దాదా పీరా, వి ఆర్వో పీర్ సా, వెంకటేశ్వర్లు,పోలీసు సిబ్బంది మొదలగువారు పాల్గొన్నారు

# శ్రీ వసుధేంద్ర తీర్థ ఆరాధన మహోత్సవాలలో పాల్గొన్న మంత్రాలయం శ్రీ శ్రీ మఠం పీఠాధిపతులు





కర్ణాటక(బి.ఎం.కెంచన్ గూడ):తెలంగాణ ముచ్చట్లు : శ్రీ వసుధేంద్ర తీర్థ ఆరాధన మహోత్సవ శుభ సందర్భంగా శ్రీ క్షేత్రం కెంచన్గూడలో విచ్చేసిన శ్రీ స్వామీజీకి భక్తులు,శిష్యులు అంగరంగ వైభవంగా స్వాగతం పలికారు. ఈ పర్యటనలో హెచ్.హెచ్.శ్రీ స్వామీజీ, బి.ఎం.కెంచన్ గూడలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డును సిర్గుప్ప ఎమ్మెల్యే నాగరాజు మరియు బళ్లారి పోలీస్ సూపరింటెండెంట్ డాక్టర్ శోభారాణి ఐపిఎస్ ప్రారంభించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు TELTEL12273 తెలుగు దిన పత్రిక

గురువారం 24-10-2024








# రామ్ చరణ్ - సమంత.. ఇది నిజమేనా?





తెలుగు సినిమా పరిశ్రమలో కొందరు హీరోలు యమా జోష్‌తో దూసుకుపోతోన్నారు. అందులో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఒకడు. ఈ మధ్యన వరుసగా హిట్లను అందుకుంటోన్న అతడు.. ఆర్ఆర్ఆర్ మూవీ తర్వాత గ్లోబల్ స్టార్‌గా మారాడు. ఈ ఊపులోనే ఇప్పుడు శంకర్ దర్శకత్వంలో 'గేమ్ చేంజర్' చిత్రంలో నటిస్తున్నాడు. ఇది సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. గేమ్ చేంజర్' షూటింగ్ జరుగుతుండగానే రామ్ చరణ్ తన 16వ సినిమాను కూడా ప్రారంభించాడు. ఈ చిత్రాన్ని 'ఉప్పెన' డైరెక్టర్ బుచ్చిబాబు తెరకెక్కించబోతున్నాడు. ఇటీవలే ఈ మూవీకి సంబంధించిన పూజా కార్యక్రమాలు సైతం కంప్లీట్ అయ్యాయి. అతి త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ కూడా మొదలు పెట్టేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేసుకుంటోంది. రామ్ చరణ్ - బుచ్చిబాబు కాంబోలో రాబోతున్న ఈ చిత్రం స్పోర్ట్స్ బ్యాగ్‌డ్రాప్‌తో రాబోతుందని ఇప్పటికే సమాచారం బయటకు వచ్చేసింది. అంతేకాదు, ఇందులో మెగా పవర్ స్టార్ రన్నర్ పాత్రను చేస్తున్నాడని టాక్ వచ్చింది. పాన్ ఇండియా రేంజ్‌లో రూపొందుతోన్న ఈ సినిమాలో రామ్ చరణ్ లుక్ చాలా డిఫరెంట్‌గా ఉంటుందని కూడా ప్రచారం జరుగుతోంది. భారీ బడ్జెట్‌తో రూపొందనున్న ఈ సినిమాలో ఎంతో మంది బడా స్టార్లు భాగం అవుతున్నారు. ముఖ్యంగా ఈ చిత్రంలో హీరోయిన్‌గా అలనాటి అందాల తార శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్‌ను తీసుకున్నారు. అలాగే, ముఖ్యమైన పాత్రల కోసం దేశ వ్యాప్తంగా గుర్తింపు ఉన్న నటీనటులను ఎంపిక చేస్తున్నారు. ఇలా ఇప్పుడు ఈ చిత్రం కోసం సమంత రూత్ ప్రభును కూడా ఫైనల్ చేశారని తెలుస్తోంది. ఫిలిం నగర్ ఏరియాలో వైరల్ అవుతోన్న తాజా సమాచారం ప్రకారం.. ఈ ప్రతిష్ఠాత్మక సినిమాలో ఓ ముఖ్యమైన పాత్ర కోసం సమంత రూత్ ప్రభును తీసుకున్నారట. ఆమె పాత్ర ఎవరూ ఊహించని విధంగా, ఎంతో నేచురల్‌గా ఉంటుందని టాక్. అందుకే ఆమె కథ విన్న వెంటనే ఇందులో నటించేందుకు ఓకే చెప్పేసిందని సమాచారం. ఇది ఎంతవరకు నిజమో కానీ ప్రస్తుతం గట్టిగానే వైరల్ అవుతోంది ఇక, గతంలో సమంత - రామ్ చరణ్ 'రంగస్థలం' మూవీలో జంటగా చేసిన విషయం తెలిసిందే. ఈ సినిమా దాదాపు రూ. 400 కోట్లు బడ్జెట్‌తో తెరకెక్కనుంది. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకటేష్ సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. అలాగే, ఈ మూవీకి మైత్రీ మూవీ మేకర్స్‌తో పాటు సుకుమార్ రైటింగ్స్ సంస్థలు నిర్మాణ భాగస్వాములుగా వ్యవహరిస్తున్నాయి. దీనికి ఏ ఆర్ రెహమాన్ మ్యూజిక్ కంపోజ్ చేస్తున్నారు.

## ఆ ట్యాగ్ నుంచి బయటకు రాలేకపోయాను.. నటి ఆవేదన




1-నేనొక్కడినే సినిమాతో నటిగా కెరీర్ ప్రారంభించింది కృతి సనోన్. ఈ అమ్మడి రిపికల్ పెర్ఫామెన్స్, స్టైల్, గట్సీ లుక్స్ మొదటి సినిమాతోనే ప్రజలకు కనెక్టయ్యాయి. కానీ మొదటి సినిమా పరాజయం పాలై నిరాశపరిచింది. అనంతరం విజయాలతో కృతి తనని తాను నిరూపించుకుని తనకంటూ ఒక స్టార్ డమ్ అందుకునేందుకు చాలా సమయం పట్టింది. కృతి సనన్ తన సుదీర్ఘ ప్రయాణంలో కొన్ని విజయాలు సాధించినా చాలా కాలం పాటు వేచి చూడాల్సి వచ్చింది. కాలంతో పాటే అనుభవాలతో రాటు దేలాక చివరకు నటిగా డెప్త్ ఉన్న మంచి అవకాశాలను ఎంచుకునే అవకాశం దక్కుతోంది. మిమీ చిత్రంలో నటనకు జాతీయ ఉత్తమ నటిగా అవార్డును అందుకుంది. ఆ తర్వాత ఎంపికల విషయంలో ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతోంది. ఇప్పుడు నిర్మాతగా మారి దోపిట్టి అనే సినిమాని నిర్మించింది. తాజా ప్రమోషనల్ ఇంటర్వ్యూలో కృతి చాలా సంగతులు ముచ్చటించింది. హీరో పంతి చిత్రంతో నటిగా హిందీ పరిశ్రమలో అడుగుపెట్టి, అటుపై దాదాపు దశాబ్దం పాటు జర్నీ సాగించాక కృతి సనన్ చివరికి ఇప్పటికి సినీ నిర్మాతగాను మారింది. కనికా ధిల్లాన్‌తో కలిసి ఈ బ్యూటీ నిర్మించిన తొలి చిత్రందో పట్టి-లో విడుదలకు సిద్ధంగా ఉంది. తాజా చాటింగ్ సెషన్‌లో కృతి తన కెరీర్ ప్రయాణం గురించి మాట్లాడింది. కృతి ఈ చిత్రంలో ద్విపాత్రాభినయం కూడా చేసింది. అందువల్ల దీనిని తన కెరీర్ లోనే అత్యంత ఛాలెంజింగ్ ప్రాజెక్ట్ గా అభివర్ణించింది. పరిశ్రమలో మెల్లగా తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకోవడానికి ప్రయత్నించిన ఔట్‌సైడర్ గా కృతికి గుర్తింపు దక్కింది. ఇప్పటికి నటిగా ఎదిగి, చివరికి సినిమా నిర్మాతగా మారడం సంతోషంగా ఉందా? అని ప్రశ్నించగా, ఇక్కడ ఏది వర్కవుటైతే దానిలో మెరుగవ్వాలని అర్థం చేసుకున్నాను.. సమయం, విజయం.. అనుభవంతో నెమ్మదిగా మరిన్ని అవకాశాలు లభిస్తాయి. ఒక నటిగా మరింతగా అన్వేషించాలి. నేను ఎదగడానికి అభివృద్ధి చెందడానికి స్పృహతో కూడిన ప్రయత్నం చేశాను అని కృతి చెప్పింది. దో పట్టితో తనకంటూ ఒక అవకాశాన్ని ఎలా సృష్టించుకోవాలనుకుంటుందో కూడా చెప్పింది. కృతి మాట్లాడుతూ నేను నిర్మాతగా మాత్రమే కాకుండా నటిగా కూడా ఈ అవకాశాన్ని దాదాపుగా సృష్టించుకున్నాను. నేను మిమీ తర్వాత ఈ ప్రయత్నం చేసాను. ఇంకేదైనా లోతైనదాన్ని కనుగొనాలనుకున్నాను. కొన్నాళ్లుగా అలాంటిది కనుగొనలేకపోయాను. నేను చేసిన కొన్ని స్క్రిప్ట్‌లు నాకు నచ్చాయి. అది తేరీ బతన్ మే... లేదా క్రూ అని చెప్పవచ్చు. రచయిత కనికా నేను కూడా మంచి కథలకు మద్దతు ఇవ్వాలని, సినిమాలు తీయాలని కోరుకుంటున్నాం.. అని తెలిపింది.


# ఎర్ర చీరలో నేహా హై గ్లామర్ డోస్



తెలుగు చిత్రసీమలో గ్లామర్ లుక్స్‌తో ఆకట్టుకునే నటి నేహా శెట్టి. ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫోటో షూట్ తో మరోసారి అభిమానులను మంత్ర ముగ్ధులను చేసింది. ఎర్ర చీరలో రిచ్ లుక్ తో అద్భుతంగా మెరిసిపోతూ, తన సొగసైన ఫోజులతో నేహా ప్రత్యేకంగా ఆకర్షించింది. అంటూ తన గ్లామర్‌కి కొత్త డెఫినిషన్ ఇచ్చింది. ఈ ఫోటోషూట్‌లో నేహా రెడ్ కలర్ చీరతో తన యాటిట్యూడ్ ను మరింత హైలైట్ చేసింది. ఆమె ధరించిన మేకప్, జువెలరీ, హెయిర్ స్టైలింగ్ అన్నీ ఆమె అందాన్ని మరింత మెరుగు పరచాయి. మేకప్ ఆర్టిస్ట్ జాస్మిన్, హెయిర్ స్టైలిస్ట్ క్రాఫ్టెడ్ హెయిర్ బై హర్, ఫోటోగ్రాఫర్ అరిఫ్ మిన్వాజ్ చేసిన ఈ అద్భుతమైన కాంబినేషన్‌తో నేహా లుక్ స్టన్నింగ్ గా ఉంది. నేహా తన కెరీర్ లోనే గ్లామర్‌కి ఎంతో ప్రాధాన్యం ఇస్తూ వస్తోంది. 'డీజే టిల్లు'లో రాధిక పాత్రలో ఆమె నటన మాత్రమే కాకుండా ఆమె గ్లామర్ కూడా సినిమాకు పాజిటివ్ రివ్యూస్ తీసుకురావడానికి తోడ్పడింది. ఆ సినిమా తర్వాత ఆమె 'బెదుర్లంక 2012', 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' వంటి చిత్రాలలో కూడా నటించి మెప్పించింది. సినిమాలలో తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న నేహా, సోషల్ మీడియాలో కూడా తన ఫ్యాషన్ సెన్స్ తో ఫాలోవర్స్‌ను సంపాదిస్తోంది. తాజా ఫోటో షూట్ లో ఆమె చేసిన స్టన్నింగ్ లుక్ కి సోషల్ మీడియాలో విపరీతమైన స్పందన లభిస్తోంది. వైబ్రెంట్ ఎర్ర చీర ధరించి, బరువైన మేకప్ తో కాకుండా సింపుల్ జ్యూయెలరీతో నేహా చాలా హుందాగా కనిపించింది. ఈ ఫోటోషూట్‌లో నేహా ఫ్యాన్స్ ఆమె గ్లామర్‌ని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. “ఎర్ర చీరలో చాలా బావుంది”, “ఇంకెప్పుడు ఇలాంటి గ్లామర్ రోల్ చూడాలి” అంటూ అభిమానులు కామెంట్లు పెడుతున్నారు.

# బీచ్‌లో నాగార్జున హీరోయిన్ యోగాభ్యాసం





మనీషాకొయిరాలా పరిచయం అవసరం లేదు. అరవింద స్వామి సరసన బొంబాయి చిత్రంలో, యాక్షన్ కింగ్ అర్జున్ సరసన ఒకే ఒక్కడు లో నటించింది. అక్కినేని నాగార్జున సరసన చాలా సంవత్సరాల క్రితమే క్రిమినల్ అనే సినిమాలోను నటించింది. ఈ మూవీలో నాగ్ - మనీషా కొయిలారా రొమాన్స్ అద్భుతం అంటూ ప్రశంసలు దక్కాయి. ఇదిలా ఉంటే మనీషాకొయిలారా జీవితంలో ఊహించని కుదుపులు, అనంతరం కంబ్యాక్ కోసం పోరాటం గురించి తెలిసినదే. మనీషాకు క్యాన్సర్ రావడంతో దానికి చికిత్స చేయించుకుని కోలుకుంది. ఇటీవల సెకండ్ ఇన్నింగ్స్ ని ప్రారంభించింది. మొన్నటికి మొన్న సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కించిన క్లాసిక్ వెబ్ సిరీస్ హీరామండిలో మనీషా కొయిలారా నటిగా మెప్పు పొందింది. భారతదేశంలో ఉన్న ఫైనెస్ట్ హీరోయిన్లలో మనీషా ఒకరు అన్న ప్రశంసలు కురిసాయి. ఇక మనీషా కొయిరాలా డైలీ వర్కవుట్స్ గురించి చెప్పుకుని తీరాలి. ఈ భామ తన వ్యాయామ సాధనకు సంబంధించిన చాలా విషయాలను వెల్లడించారు. మనీషా మాట్లాడుతూ.. యోగా, జిమ్, ఏరోబిక్స్ లేదా డ్యాన్స్ ఏ రూపంలోనైనా కదులుతూ ఉండండి.

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY BOLLEPAKA RAJESH,PRINTED AT AMULYA PUBLICATIONS & PRINTERS GRAPHICS,H-NO: 2-19/1,VILLAGE & POST THATIKAYALA,DHARMASAGAR MANDAL,HANUMAKONDA DIST,TELANGANA STATE-506151.“PUBLISHED AT H.NO: 2-19/1,VILLAGE & POST THATIKAYALA, DHARMASAGAR MANDAL,HANUMAKONDA DIST,TELANGANA STATE-506151.EDITOR : BOLLEPAKA RAJESH,RNI: TELTEL/2023/88710,“CELL:9493669669, MAIL ID:telanganamuchatlu.in@gmail.com,Website:telanganamuchatlu.in